ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

అక్టోబర్ 5, 2008

అణువిద్యుత్
అవకాశాలు - అపాయాలు



హ్యాపీబర్త్‌డే

(2008 అక్టోబర్ -5 నుంచి 2008 అక్టోబర్-11 వరకు)

ఎల్.పి.కిరణ్
9సం॥, అక్టోబర్-1999
మంజుల-నర్సింగ్‌రావు
పద్మారావుసగర్-సికింద్రాబాద్

డి. సాయిరాం
1సం॥, అక్టోబర్-5
రజిని-రాజేష్
కంచరపాలెం-విశాఖ

జె. మౌనిక
5సం॥, అక్టోబర్-5
కృష్ణవేణి-శ్రీనివాస్
ధర్మన్నగూడ-రంగారెడ్డి

నిఖిత
4సం॥, అక్టోబర్-7
సంతోష-వెంకటేష్
ఆరుట్ల-రంగారెడ్డి

బి. రణదీప్‌కుమార్
6సం॥, అక్టోబర్-6
సంతోష-వెంకటేష్
ఆరుట్ల-రంగారెడ్డి

కె. నవీన్
9సం॥, అక్టోబర్-5
శరత్‌కుమారి-రాజు
అజ్జంపూడి-కృష్ణా

ఎం. రాజేష్
6సం॥, అక్టోబర్-9
సౌజన్య-సురేంద్రనాథ్
యడ్లపాడు-గుంటూరు

బి. నేహరెడ్డి
అక్టోబర్
లక్ష్మి-మనోహర్‌రెడ్డి
అక్కయపల్లి-కడప

సాయి అఖిల్
అక్టోబర్-8
మణి-రాజశేఖర్
తణుకు-ప॥గో

టి. పావని
4సం॥, అక్టోబర్-2004
ధనలక్ష్మి-నరేంద్రకుమార్
తుళ్ళూరు-గుంటూరు

యువత

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

మన అతిథి

పేరు : డాక్టర్ టి. సుందరరామన్
స్వస్థలం : తంజావూరు, తమిళనాడు
పుట్టిన తేదీ : 10 జూన్, 1956
తల్లిదండ్రులు : త్యాగరాజన్, పట్టు త్యాగరాజన్

విద్యార్హత : ఎండి, ఎంబిబిఎస్
హాబీలు : పుస్తకాలు చదవటం, వాకింగ్ చేయటం, బొమ్మలు గీయటం
ప్రస్తుతం నిర్వహిస్తున్న పదవులు : నేషనల్ హెల్త్ సిస్టమ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తమిళనాడు సైన్స్ ఫోరం సభ్యులు
రచించిన పుస్తకాలు : వైద్యరంగంపై తమిళం, ఆంగ్లాల్లో వందకు పైగా పుస్తకాలు

సామాజిక మార్పు తీసుకురావటానికి కావలసిన అన్ని అవకాశాలు, సదుపాయాలు ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్నాయి. వాటిని ఉపయోగించుకోవటంలో అటు ప్రభుత్వాలు, ఇటు ప్రజలు విఫలమవుతున్నారు. యువత తమకు వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవటంపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

ఈ సంచికలో....

టపా ... 2
సీరియల్ ... 8
సమ్‌థింగ్ స్పెషల్ ... 9
సినిమా ... 10
రుచి ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14

ఇంకా...



మంచి పుస్తకం ... 18
విజ్ఞాన వీచిక ... 20
మనసా... తెలుసా ... 21
లాహిరి ... 22
కొత్త పుస్తకాలు ... 24

ఆరోగ్యం ...17
ఆస్తమా - అలర్జీ

చూద్దామా ... 3
ఫాల్‌కిర్క్ వీల్

కథ ...6
కోడికూర



అతిథి బావుంటోంది

స్నేహ సంచికలో వారం వారం పరిచయంజేస్తున్న మన అతిథి (మొదటి పేజీ) బావుంటోంది. ఈ వారం (సెప్టెంబర్ 21) సినిమా కబుర్లలో గొల్లపూడి మారుతీరావు చెప్పిన ముచ్చట్లు బాగున్నాయి. అట్టమీది కథ మలేసియాలో ఎన్నెన్నో అందాలు... చదివాక ఆయా ప్రదేశాలను చూసినంత అనుభూతి కలిగింది.

కె. కాశీ విశ్వేశ్వరరావు,
విశాఖపట్నం.

'పొగ' పెనుముప్పు తెలిసింది

ఈవారం స్నేహలో అట్టమీది కథ గా మలేసియాలో ఎన్నెన్నో అందాలు... రచన చదివి ప్రత్యక్షంగా చూశామా అన్నంత ఆనందాన్ని చవిచూశాం. విజ్ఞానవీచిక చదివి పొగతాగడం ఎంతటి ఘోర పెనుముప్పో మాకు తెలిసింది. చిన్న వయస్సులోనే అత్యద్భుత ప్రతిభను కనబరుస్తున్న కిషన్ శ్రీకాంత్‌కి మా అభినందనలు. కుర్బీ కా కమాల్ చిత్రాలు కడు రమ్యంగా ఉన్నాయి. ఆరోగ్యం ద్వారా... రూట్ కెనాల్ చికిత్స గురించి అవగాహన కలిగింది. చూద్దామాలో టవర్ ఆఫ్ లండన్ విశేషాలు ఆకట్టుకున్నాయి. సినిమా కబుర్లు ద్వారా గొల్లపూడి మారుతీరావు వంటి బహుముఖ ప్రజ్ఞాశాలిని కలుసుకోవడం మాకెంతో సంతోషమనిపించింది. మానవత్వం, నైతిక విలువలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలంటున్న కుసుమకుమారి గారిని ఈ వారం మన అతిథిగా మాముందుకు తెచ్చిన స్నేహవారికి కృతజ్ఞతలు.

నేమాన సుభాష్ చంద్రబోస్,
శ్రీకాకుళం.

హృద్యమైన ముఖచిత్రం

మొదటి జీతం మరువని కుసుమ కుమారి దేశ ప్రజలనూ మరువరు. రూట్‌కెనాల్ దంత చికిత్స ఖరీదైన వైద్యం. టవర్ ఆఫ్ లండన్ విశేషాలు చదవాల్సిందే. గ్రామ వైద్యుడు వేపచెట్టు అనటంలో తప్పు లేదు. మారుతీరావు రచన వైరుధ్యము. హాయిగా ఉంటుంది. బ్రెడ్ బాల్సా... ఏమి రుచండి? థౌజండ్ ఫింగర్స్ బనానా భలే బాగుంది. మరణమృదంగం పొగతాగుడు. ముఖచిత్రం హృద్యంగా ఉంది.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్,
నెల్లూరు.

మంచి పుస్తకాన్ని పరిచయం చేశారు

గీతా రామస్వామి, విమల రచన 'మా కొద్దీ చండాలం' పుస్తకాన్ని పరిచయం చేసినందుకు అభినందనలు. 1993 జూన్5న డ్రై లెట్రిన్ల పాకీ పనిని నిషేధించినప్పటికీ దేశంలో ఈ తరహా లెట్రిన్లు కొనసాగుతున్నాయి. విశాఖ జిల్లాలో సామూహిక డ్రై లెట్రిన్లు 140 ఉన్నాయి. వ్యక్తిగత డ్రై లెట్రిన్లు వందల సంఖ్యలో ఉంటాయి. ఉద్యమకారులకు అవగాహన కోసం ఈ పుస్తకం పనికొస్తుంది. 'మలేసియాలో ఎన్నెన్నో అందాలు' కవర్‌స్టోరీ ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నాం.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

మలేసియా వెళ్లినంత ఆనందంగా వుంది

సెప్టెంబర్ - 21న స్నేహ సంచికలో (అట్టమీది కథ) మలేసియాలో ఎన్నెన్నో అందాలు చదివాం. అక్కడ వున్న అందచందాలు, ఆ దేశమంతటా చూడదగ్గ ప్రదేశాలు చదివాం. చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ వారం మలేసియా వెళ్లినంత ఆనందంగా ఉంది. సినిమా కబుర్లులో చలనచిత్ర రంగంలో కథ, మాటల రచయితగా పేరుపొందిన గొల్లపూడి మారుతీరావుగార్కి అభినందనలు. ఈవారం స్నేహ అభిమానులకు, స్నేహితులకు కళాకారులకు మరచిపోలేని అనుబంధం. అలాగే కథ, మాటల రచయితగా, నిర్మాతగా, దర్శకుడిగా ఎన్నో చిత్రాలను చేసి మరెన్నో అవార్డులందుకోవాలని, విజయనగర అభిమానులకు మరింత దగ్గరవ్వాలని మేమంతా కోరుకుంటున్నాము. ప్రేమ పుస్తకం సినిమా ఎన్నడూ మరిచిపోలేని సినిమా. గొల్లపూడి శ్రీనివాస్ గారు మరిచిపోలేని జ్ఞాపకం. మన ముందు లేకపోవడం మన దురదుష్టకరం. విజ్ఞాన వీచికలో పొగ తాగటం ప్రమాదకరమని తెలిసి కూడా చాలా మంది దమ్ము కొడుతుంటారు. ముఖ్యంగా బస్సులో పొగ త్రాగరాదు అని వుంటుంది, అయినా తాగుతారు. అలా తాగినవాళ్లకు జరిమానా వేయాలి. పొగ తాగటం వల్లేకదా గౌతమీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రమాదం జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. రైల్లోగానీ, బస్సులోగానీ పొగతాగేవాళ్లకి సరైన బుద్ధి చెప్పాలి. పొగతాగేవారు చాలామంది క్యాన్సర్‌తో చనిపోతున్నారు. వారి కుటుంబాలు రోడ్డు పాలైపోతున్నాయి. పొగతాగి ప్రాణాల మీదికి తెచ్చుకోకండి. యాజీవ్‌గారికి కృతజ్ఞతలు.

అనుపోజు సత్యనాగరాజు,
రాజీవ్‌నగర్ కాలనీ, విజయనగరం.

రూట్ కెనాల్ చికిత్స తెలుసుకున్నాం

స్నేహలో "ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకెళ్లాలి, భారత



దేశంలో వివిధ ఉపాధి వనరులు పుష్కలంగా ఉన్నాయి. యువత దానిని చక్కగా సద్వినియోగం చేసుకోవాలి. మహిళలమని నిరాశపడకుండా అన్ని రంగాలలో ముందుకు దూసుకెళ్లాలి. ప్రపంచంలోనే భారతదేశం ప్రముఖ స్థానంలో ఉంది. అమెరికా అంటూ పొరుగు దేశాలకు పరుగులు మానుకోవాలి. భారతదేశ నైతిక విలువలను కాపాడుదాం" అంటూ మన అతిథిలో కుసుమకుమారిగారిచ్చిన సందేశం బాగుంది. వారి ఇష్టా ఇష్టాలు చాలా బావున్నాయి. ఆరోగ్యంలో దంతక్షయం రూట్‌కెనాల్ చికిత్స గురించి విశ్లేషణాత్మకంగా తెలియజేశారు. రూట్‌కెనాల్ చికిత్స ఎప్పుడు అవసరం? ఎంత సమయం పడుతుంది? అన్న అంశాలను తెలుసుకున్నాం. చూద్దామాలో టవర్ ఆఫ్ లండన్ గురించి ఫోటోలతో సహా మాకు అందించిన ఎస్. వినయకుమార్ గార్కి నా నమస్కారములు.

కర్రా వరప్రసాద్, యలమర్రు,
కృష్ణా జిల్లా.

*

ఈ ఫోటో ఓ ప్రముఖ వ్యక్తిది. జవాబు తెలియాలంటే 20వ పేజీలో చూడండి.

ఆధునిక ఇంజనీరింగ్ అద్భుతం ఫాల్‌కిర్క్ వీల్

ఎస్.వినయకుమార్







స్కాట్లాండ్‌లోని అద్భుతాల్లో... ఫాల్‌కిర్క్ వీల్, ఎత్తైన కొండ ప్రాంతాలు, అందమైన సరస్సులు, స్కాచ్ పరిశ్రమలు...ప్రధానమైనవి. ఈ వారం వాటి అందాలు, విశేషాల గురించి తెలుసుకుందామా!

స్కాట్లాండ్‌లోని ఒక అద్భుత నిర్మాణం ఫాల్‌కిర్క్ వీల్. స్కాట్లాండ్ రాజధాని ఎడిన్‌బర్గ్‌కు గ్లాస్గోకు(స్కాట్లాండ్‌లోని అతి పెద్ద నగరం, ఒకనాటి పారిశ్రామిక కేంద్రం) మధ్య దాదాపు సమాన దూరంలో ఫాల్‌కిర్క్ అనే చిన్న పట్టణానికి దగ్గరలో ఉంది. కనుక దీనికి ఆపేరు పెట్టారు. ఈ ఇంజనీరింగ్ అద్భుతాన్ని ఇంగ్లండ్ మహారాణి 2వ ఎలిజబెత్ తన స్వర్ణోత్సవాల్లో భాగంగా 2002లో ప్రారంభించారు. ఈ తరహా నిర్మాణం ప్రపంచంలో మరెక్కడా లేదు. అనతికాలంలోనే ఇదో ముఖ్యమైన పర్యాటక కేంద్రంగా మారింది.

స్కాట్లాండ్ లాండ్‌స్కేప్‌ల మయం. సమతలంగా ఉండే ప్రదేశం తక్కువ. అంతా ఎత్తుపల్లాలే. అవే స్కాట్లాండ్‌కు ఎక్కడలేని అందాలను తెచ్చిపెట్టాయి. గ్లాస్గో నగరం నుండి నేను ఫాల్‌కిర్క్‌కు చేరుకున్నాను. సెప్టెంబర్ నెల ముగింపుకొస్తోందంటే ఇక్కడ వేసవి ముగింపుకొచ్చినట్టే. వేసవి అంటే మనదేశంలోలా కాదు. ఉదయం 9 గంటలకు నేను బస్టాండ్‌కని ఇంట్లోనుండి బయల్దేరినప్పుడు నోటినుండి ఆవిర్లు వస్తున్నాయి. ఒకవైపు ఎండ, మరోవైపు నోరు మెదిపితే ఆవిర్లు, పల్లెల గుండా బస్సు ప్రయాణం. అందంగా తీర్చిదిద్దినట్లుగా ఉండే పల్లెలు. పల్లె పల్లెకు మధ్య పచ్చిక బయళ్లు. ఉదయం 11గంటలైనా, ఎండకాస్తున్నా పచ్చికపై పొగమంచు అలాగే ఉంది. ఉలెన్ ఇన్నర్లు, కోట్లు, బస్సులో ఎయిర్ కండిషన్‌లో నుండి మంద్రంగా వేడిగాలి. అయినా నాకు ఆగని చలి. స్థానికులకు ఉక్కపోత. మనం చలితో ముడుచుకు కూర్చుంటే వాళ్లు బస్‌లోకొచ్చి ఉక్కపోత భరించలేక వెంటిలేటర్ తెరిచిపెడ్తున్నారు. బయట పచ్చిక బయళ్లలో అక్కడక్కడా గొర్రెలమందలు, పశువుల మందలు. కొన్ని చోట్ల గుర్రాలు. అక్కడక్కడ పొలాల్లో కోసి పెద్దపెద్ద రీళ్లుగా చుట్టిన పశుగ్రాసం, పల్లెల మధ్య ఒకటి రెండు చోట్ల మాత్రం ఏదో పంటలు. అయినా మనుషులు కనిపిస్తే ఒట్టు.

ఫాల్‌కిర్క్‌వీల్ రెండు కెనాళ్లను అనుసంధానం చేస్తుంది. స్కాట్లాండ్ అంతా ఎత్తుపల్లాలే కదా. రెండు కెనాళ్ల మధ్య ఎత్తులో తేడా 79 అడుగులు. ఎనిమిది అంతస్తుల భవనమంత ఎత్తన్నమాట. ఒక కెనాల్‌లోని భారీ పడవను మరో కెనాల్‌లోకి తీసుకెళ్లడమే ఇక్కడ వీల్ చేసే పని. మొత్తం వీల్ వ్యాసం 110 అడుగులు. వీల్‌కు రెండు భుజాలుంటాయి. వీటి పొడవు దాదాపు 82 అడుగులు. నీటితో సహా ఒకేసారి ఒక భుజంపై నాలుగేసి పడవల్ని పైకి తీసుకెళ్లగలవు. ఒకభుజం నాలుగు పడవల్ని పైకి తీసుకెళ్తే మరో భుజం నాలుగు పడవల్ని కిందికి తేగలదు. అయితే నేను వెళ్లినప్పుడు రెండు భుజాలు చెరో భారీ పడవను పైకి కిందికి చేర్చాయి. ఒక భుజం కింది కెనాల్‌లో ఉన్నప్పుడు మరో భుజం పైకెనాల్‌లో ఉంటుంది. కింది కెనాల్‌లోని పడవ భుజం మధ్యలోకి వచ్చాక, 80వేల ఇంపీరియల్ గ్యాలన్ల నీటితో సహా పైకి లేస్తుంది. 600 టన్నుల బరువును రెండు భుజాలు భరించగలవు. పైనున్న పడవల్లో బరువు తక్కువగా ఉండి కిందున్న పడవల్లో బరువు ఎక్కువగా ఉన్నా ఏమీకాదు. ఎందుకంటే ఆర్కిమెడిస్ సూత్రం ప్రకారం ఎంత బరువు ఉంటే అంత నీరు బయటకు పోతుంది కనుక. పడవలు భుజంలోకి చేరాక మెల్లగా ఒక భుజం కిందికి రావడం మరో భుజం పైకి వెళ్లడం మొదలెడ్తాయి. పైకి వెళ్లిన పడవ పైన లాకులు తెరిచాక కెనాల్‌లోకి ప్రయాణం మొదలెడ్తుంది. అలాగే కిందికి చేరిన పడవ లాకులు తీశాక కింది కెనాల్‌లోకి వచ్చేస్తుంది. పడవ పైకి కిందికి రావడానికి కేవలం ఐదు నిమిషాల సమయం పడ్తుంది. దీని నిర్మాణంలో ఉన్న విశిష్టత ఏమిటంటే ఈ ప్రక్రియకు అయ్యే కరెంట్ ఖర్చు నామమాత్రం. ఎనిమిది కెటిల్స్ నీటిని మరగబెట్టడానికి ఎంత విద్యుత్‌శక్తి అవసరమో పై పడవ కిందికి, కింది పడవ పైకి చేరడానికి అంత కరెంట్ చాలట. లాకుల విధానం ద్వారా పల్లపు ప్రాంతాల నుండి ఎత్తైన ప్రాంతాలకు పడవలను చేర్చటం పురాతనమైన ప్రక్రియే. అయితే రొటేటింగ్ పద్ధతిలో



పడవలను పైకి కిందికి చేర్చటం మాత్రం ఇక్కడే జరుగుతోంది. అయితే ఈ నిర్మాణం వాణిజ్య అవసరాలను తీర్చడానికి చేసింది మాత్రం కాదు. కేవలం పర్యాటకులను దృష్టిలో పెట్టుకొనే దీన్ని నిర్మించారు. రెండు భుజాలకు సమాంతరంగా కొన్ని అడుగుల దూరంలో మరో రెండు భుజాలుంటాయి. ఈ రెండింటి మధ్య కాంక్రీట్ తొట్టిలాంటిది ఉంటుంది. పడవలు ఈ తొట్టిలోకి చేరాక లాకులను కట్టేస్తారు. ఆ తర్వాత రొటేషన్ ప్రారంభమౌతుంది. పడవలోకి ప్రయాణికులు ఎక్కి పైకి వెళ్లి పై కెనాల్‌లోకి కొద్దిసేపు షికారు చేసి మళ్లీ కిందికి రావడానికి మొత్తం నలభై నిమిషాల సమయం పడ్తుంది. పడవలో ఉన్న టీవీ సెట్లు ఈ సమయంలో మొత్తం ప్రక్రియను, విశిష్టతను వివరిస్తాయి. రుసుము మనిషికి ఎనిమిది పౌండ్లు.

ఇంగ్లండ్‌లో రోడ్డు మార్గాలు, రైల్వే మార్గాలు అభివృద్ధి కాకముందు సరుకుల రవాణా కోసం కాలువలను నిర్మించారు. లాకుల పద్ధతి ద్వారా సముద్ర మట్టం నుండి ఎత్తైన ప్రాంతాలకు సరుకులను చేర్చేవారు. చివరి బోట్ లిఫ్ట్ లాకును యు.కెలో 1875లో నిర్మించారు. వాణిజ్య ప్రాతిపదికన వీటిని ఉపయోగించటం మానేసి చాలా ఏళ్లు గడిచాయి. ఇప్పుడు అక్కడక్కడ సరదా షికార్ల కోసం ఉపయోగిస్తున్నారు. పర్యాటకులను ఆకర్షిస్తున్నారు.

ఫాల్‌కిర్క్ వీల్ మొత్తం ప్రాజెక్టు నిర్మాణానికి 8 కోట్ల 45 లక్షల పౌండ్లు ఖర్చయ్యాయి. వీల్ నిర్మాణానికే కోటి 75 లక్షల పౌండ్లు పట్టింది. మొత్తం నిర్మాణ ఖర్చులో 3కోట్ల 20 లక్షల పౌండ్లు నేషనల్ లాటరీ ఫండ్ ద్వారా సేకరించారు.

హైలాండ్స్

స్కాట్లాండ్‌కు ఉత్తర ప్రాంతంలో ఎత్తైన కొండ ప్రాంతాలున్నాయి. వాటిని హైలాండ్స్ అంటారు. చూడటానికి అందమైన ల్యాండ్ స్కేప్‌లు ఎన్నో. పర్వత ప్రాంతాలైనప్పటికీ ఈ రోడ్లు ఎప్పటికీ సందర్శకుల కార్లతో, బస్సులతో, క్యారవాన్లతో బిజీగా ఉంటాయి. చలి కాలంలో ఈ కొండల్లో స్కీయింగ్ (మంచులో జారుకుంటూ వెళ్లే ఆట) చేస్తుంటారు. మామూలు సమయాల్లో మౌంటనేరింగ్ (తాళ్లు వేసుకొని కొండలు ఎక్కడం) మైళ్ల కొద్దీ కొండల మధ్య నడవడం చేస్తుంటారు. సందర్శకులు నడవడానికి ప్రత్యేక రోడ్లు ఏర్పాటు చేశారు. బ్రిటన్‌లోని ఎత్తైన పర్వతాలు (బ్రిటిష్ ఐసల్స్, బెన్ నెవిస్) హైలాండ్స్‌లోనే ఉన్నాయి. ఈ కొండల్లో అనేక సరస్సులుంటాయి. చాలా పెద్ద సరస్సులు, చాలా లోతైన సరస్సులు. ఈ కొండ ప్రాంతాల్లోని ప్రజలు గాలిక్ అనే భాషను మాట్లాడుతారు.

ఈ సరస్సుల్ని లాఖ్స్ అని పిలుస్తారు. లాఖ్ అంటే గ్యాలిక్ భాషలో భారీ పరిమాణంలో ఉన్న నీరు అని అర్థం. రాతలో సింపుల్‌గా ఎల్ఓసికె అని రాసినా ఉచ్చరించేటప్పుడు 'ఖ' కు 'హ' ఒత్తు పెట్టినట్టుగా ఉచ్చరిస్తారు. సరస్సుల మధ్య ద్వీపాలు ఉంటాయి. జన సాంద్రత తక్కువ. భూములన్నీ అలా పడి ఉంటాయి. వ్యవసాయం చేయరు. చైనాలో కొండలు గుట్టలమీద కూడా ఏదో ఒక పంట పండిస్తారు. స్కాట్లాండులో కొండ ప్రాంతాల్లోనే కాదు మామూలు భూముల్లో కూడా వ్యవసాయం తక్కువే. పర్యాటక రంగమే ఇక్కడ పెద్ద పరిశ్రమలా కనిపిస్తుంది.
అక్కడక్కడ ఖనిజాల తవ్వకం ఉంటుంది.
సరస్సులు, కొండల



మధ్య జలపాతాలను ఉపయోగించి హైడల్ విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేస్తుంటారు.

అక్కడక్కడ గోల్ఫ్ కోర్టులుంటాయి. ఈ అందమైన ప్రదేశాల్లో సినిమాలను చిత్రీకరిస్తుంటారు. ఇటీవలి కాలంలో హిందీ సినిమాల కోసం ఇక్కడ షూటింగ్‌లు చేస్తున్నట్లు మా గైడ్ చెప్పాడు.

ఈ కొండ ప్రాంతాల్లో ప్రత్యేక స్థానిక సంస్థల ఆధ్వర్యంలో స్థానిక పరిపాలన సాగుతుంది. ఈ కౌన్సిళ్లకు కొన్ని అధికారాలుంటాయి. 1998లో స్థానిక పరిపాలన కోసం యూనిటీ కౌన్సిల్‌ను ఏర్పరచారు.

లాఖ్‌లోమండ్, లాఖ్‌నెస్ అనే రెండు సరస్సుల్ని నేను సందర్శించాము. ఈ సరస్సు పొడవు దాదాపు 25 మైళ్లు. కొన్ని చోట్ల వెడల్పు 5 మైళ్లు. లోతు 650 ఫీట్ల వరకు ఉంటుంది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఈ ప్రాంతాల్లో టార్పికోలోను సామర్థ్యాన్ని పరిశీలించుకోవడానికి ఉపయోగించేవారు. సరస్సు లోతు చాలా ఎక్కువ కనుక సముద్ర గజ ఈతగాళ్లకు ఇక్కడ శిక్షణ ఇస్తుంటారు. జలాంతర్గాముల సామర్థ్యాన్ని కూడా పరిశీలించడానికీ ఈ సరస్సుల్ని ఉపయోగిస్తుంటారు. సరస్సు పొడవుగా అనేక పర్యాటక కేంద్రాలు, హోటళ్లు ఉంటాయి.

లాఖ్‌లోమండ్ కంటే ఎత్తులో ఉండే సరస్సు లాఖ్‌నెస్, ఇది కూడా పొడవులో లాఖ్‌లోమండ్ అంత ఉంటుంది. లోతు 750 అడుగుల దాకా ఉంటుంది. వెడల్పు మాత్రం ఒక మైలు ఉంటుంది. లాఖ్‌నెస్‌లో మాన్‌స్టర్స్ ఉంటాయని అనేక కథలున్నాయి. అవన్నీ ఊహాజనితాలు, కట్టుకథలేనని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

ఈ పర్వత ప్రాంతాల్లోని ప్రధాన పట్టణం ఇన్వర్‌నెస్ సముద్రం నుండి పడవలు అక్కడికి వస్తుంటాయి. స్కాట్లాండ్‌లో చాలా చోట్ల పడవలు, నౌకలు పట్టణాల్లోకి రావడానికి కాలువలు తవ్వారు. స్కాట్లాండ్ ఉత్తర ప్రాంతం నుండి దక్షిణ ప్రాంతానికి నౌకలు సముద్రంలో వెళ్లడానికి చాలా సమయం, ఖర్చు అవుతుంది కనుక లాఖ్‌లను నౌకాప్రయాణానికి ఉపయోగించుకోవాలన్న ప్రయత్నం జరిగినా, అది పూర్తి కాలేదు. ఇన్వర్‌నెస్ నుండి యూరప్‌లోని అనేక పట్టణాలకు విమానాలున్నాయి. లండన్‌కు రెండు గంటల్లో ఇన్వర్ నెస్‌కు చేరుకోవచ్చు. లండన్‌లో నివసించడం చాలా ఖర్చుతో కూడింది కనుక కొందరు సాఫ్ట్‌వేర్ నిపుణులు ఇన్వర్‌నెస్‌లో నివసిస్తారని, శుక్రవారం రాత్రి లండన్ నుండి విమానంలో ఇన్వర్‌నెస్ చేరుకుని, సోమవారం ఉదయం లండన్ బయల్దేరి వెళ్తారని మా గైడ్ చెప్పాడు. హైలాండ్స్ గ్రామాలు చాలా చిన్నవి. అన్ని గ్రామాల్లో స్కూళ్లు నడపడం సాధ్యం కాదు. ద్వీపాల్లో ఈ సమస్య మరీ ఎక్కువ. అందుకని పాఠాలను ఇంటర్‌నెట్‌లోనే బోధిస్తుంటారు. కొన్ని ప్రత్యేక పాఠాలకు, పరీక్షలకు విద్యార్థులు హాజరయితే చాలు. విద్యారంగంలో ఇంటర్నెట్ ప్రముఖ పాత్రే నిర్వహిస్తోంది. కనుక ఇంటర్నెట్ ఏర్పాటు చేసుకోలేని వారికి ప్రభుత్వమే నెట్ కనెక్షన్ ఇస్తుందని ఇటీవలే బ్రిటన్ ప్రధాని బ్రౌన్ తన పార్టీ వార్షిక సమావేశాల్లో ప్రకటించారు.

స్కాచ్ పరిశ్రమలు

స్కాచ్ విస్కీకి స్కాట్లాండ్ ప్రసిద్ధి. ఎక్కువ పరిశ్రమలు హైలాండ్స్ ప్రారంభంలో ఉన్నాయి. కొండల నుండి వచ్చే నీటిని ఉపయోగించి స్కాచ్ విస్కీ తయారు చేస్తారు. కొండల్లోని చెట్లు చేమల మధ్య నుండి వచ్చే నీరు కనుక ఆ నీటిని ఉపయోగించడం వల్లే స్కాచ్‌విస్కీకి ప్రత్యేక రుచి వస్తుందని అంటారు.

హైలాండ్స్ ప్రారంభంలోని ఒక చిన్ననదిపై ఆధారపడి 18 డిస్టిలరీలున్నాయి. సాధారణ విస్కీతో పాటు అతి ఖరీదయిన మాల్ట్ విస్కీని తయారు చేసే పరిశ్రమలున్నాయి. వేల లీటర్ల విస్కీని తయారు చేసే డిస్టిలరీల్లో కూడా కార్మికుల సంఖ్య అతి తక్కువ. అత్యంత ఖరీదయిన మాల్ట్ విస్కీ తయారు చేసే ఒక డిస్టిలరీలో ముగ్గురంటే ముగ్గురు కార్మికులు పని చేస్తారు. హైలాండ్ హోటళ్లలో వచ్చే టాప్ నీరు నిజంగానే తేలికగా, రుచిగా ఉంటుంది. గ్లాసుల కొద్దీ తాగేయవచ్చు. ఈ నీరు తాగితే బడలిక తీరినట్టు అన్పిస్తుంది. బాటిల్ వాటర్ పరిశ్రమలు కూడా ఇక్కడ కన్పిస్తుంటాయి.

బంకర్ల అమ్మకం

హైలాండ్స్ నుండి గ్లాస్గోకు తిరిగి వస్తుండగా స్టర్లింగ్ పట్టణానికి ముందు మా గైడ్ బస్సులో నుండే ఒక ప్రదేశాన్ని చూపెడ్తూ అక్కడ బంకర్లు అమ్మకానికి ఉన్నాయని చెప్పాడు. సమాచార వ్యవస్థతోపాటు బంకర్లలో నివసించడానికి అన్ని సౌకర్యాలున్నాయన్నమాట. సోవియెట్ యూనియన్ ఎప్పుడైనా దాడి చేయవచ్చని ఆ బంకర్లను నిర్మించారట. ఇప్పుడు సోవియట్ యూనియన్ లేదు కనుక బంకర్లను అమ్మకానికి పెట్టారట. నిజానికి సోవియట్ యూనియన్ ఎప్పుడూ ఇంగ్లాండ్‌పై దాడి చేయలేదు. సోవియట్‌ను ఒక బూచిగా చూపెట్టడానికి మాత్రం బంకర్లు ఉపయోగపడ్డాయి. ఇలాంటి బంకర్లను ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌ల్లో నిర్మించుకోలేదేమో, అమెరికా నుండి బ్రిటన్ లాంటి దాని మిత్ర దేశాల నుండి ఇంతటి ప్రమాదం ముంచుకొస్తుందని బహుశా వారు ఊహించలేదేమో! మరో విచిత్రమేమిటంటే ఇంతటి సంపన్న దేశం బ్రిటన్‌లో చలికాలంలో 50 లక్షల మంది పిల్లలు చలి, ఆకలి బాధలకు గురవుతుంటారు. చలి కాలం ప్రారంభం కాబోతుంది కనుక ఈ పిల్లల్ని చలి నుండి, ఆకలి నుండి రక్షించడానికి చర్యలు చేపట్టాలని టీవీ చానళ్లల్లో ఒక వార్త ప్రసారమయింది. ✻

కథ

కోడికూర

అంజన.కె

వాకిట్లో కాలింగ్ బెల్ కొట్టి నిలబడింది. హాల్ కర్టెన్ గాలికి కదిలి లోపలి దృశ్యం కనిపించింది సుబ్బులుకు. గదంతా రంగురంగుల బూరలు, రిబ్బన్లతో అలంకరించి వుంది. కిందంతా సగంబడా వదిలేసిన పళ్లేలు...కూల్ డ్రింక్ సీసాలు...ఖాళీ ఐస్‌క్రీమ్ కప్పులు... పడి పొర్లుతున్నాయి. ఆ ఎంగిలి పళ్లేల్లో ఎన్ని మాంసం ముక్కలో తినలేక వదిలేసినవి. నిన్న తన కొడుకు ఒక్క కోడి ముక్క కోసం ఏడ్చి ఎన్ని దెబ్బలు తిన్నదీ గుర్తొచ్చి సుబ్బులు మనసు బాధతో మూలిగింది ఒక్కసారిగా.



జోరున వర్షం కురుస్తోంది. మబ్బులు దట్టంగా కమ్ముకోవడంవల్ల సాయంత్రం నాలుగింటికే చిక్కటి చీకటి చాప పరిచినట్టుంది. కాళ్లమీద మాగన్నుగా పడుకొని వున్న కొడుకుని జోకొడుతోంది సుబ్బులు యాంత్రికంగా. కళ్లు మాత్రం బయట పడుతున్న వర్షాన్ని చూస్తున్నాయి. కానీ మనసు ఎక్కడో వుంది. దేని గురించో తీవ్రంగా ఆలోచిస్తోంది. రేకుల కప్పు రంధ్రాలలోంచి సన్నగా జల్లు పడి ఇల్లు తడుస్తోంది. అదేమీ పట్టించుకునే స్థితిలో లేదు. సరిగ్గా చెప్పాలంటే బోషాణం అంత గది అది. అందులోనే ఓ మూలన కాళ్లు డొక్కలో పెట్టుకుని పడుకుని వున్నాడు సుబ్బులు పెనిమిటి కోటయ్య. వాన తుంపరలు పడి మెలకువ వచ్చిందతనికి. ఇహలోకంతో సంబంధం లేకుండా శూన్యంలోకి చూస్తున్న సుబ్బుల్ని చూసి జాలేసిందతనికి. కొడుకు దిక్కు తిరిగాడు. ఏడ్చి ఏడ్చి పడుకొని నిద్రపోతున్నాడు. కళ్లు బాగా ఉబ్బి వున్నాయి. నిద్రలోకూడా అప్పుడప్పుడూ వెక్కుతూనే వున్నాడు. వాణ్ణి...వాడి మొండిపట్టుదలను చూసి అతనికి నవ్వొచ్చింది. అంతలోనే జాలేసింది. అసలు సుబ్బులు వాణ్ణి అంతగా ఎందుకు కొట్టిందో మాత్రం అర్థంకాలా! సుబ్బులు మొహంలో కన్పించిన కోపం తాలూకు తీవ్రత చూసి అడిగే సాహసం చేయలేకపోయాడు. ఇంతలో కాలిమీద పడిన చినుకులు చూసి...

"సుబ్బీ...ఏవే సుబ్బీ..." పిల్చాడు ప్రేమగా. మెల్లగా.

సుబ్బులు కళ్లు మాత్రం తిప్పి ఏంటన్నట్టు చూసింది.

"గదిలో వాన పడ్తోందే. పిల్లాడు తడిసిపోగలడు. ఈ మూలకు జరిగి కూకోరాదు!" అన్నాడు నిమ్మళంగా.

"అయ్యో! కొంపంతా తడిసిపోయిందిగా మావా! ఇదిగో ఈణ్ణి కాస్త చూసుకో. వాన పడేకాడ నాలుగు బొచ్చెలు పెడతాను. అయినా కట్టే దబ్బు కడుతూనే ఇదేం కర్మో. అద్దె మాత్రం నెల తిరిగేసరికి టంచనుగా కట్టించుకుంటారు. పానం మీదకొచ్చినా ఒక్కరోజు కూడా ఆగరు. కొంపలో వాన పడుతోందని చెప్పినా బాగుసేయించరు. కక్కుర్తి మదుసులు...కక్కుర్తి మదుసులు..." గొణుక్కుంటూ కొడుకును భర్తపక్కన పండబెట్టింది.

"ఏందే...నువ్వేదో యేలకు యేలు కిరాయి కట్టినట్టు మా గుంజుకుంటన్నావ్! ఐదొందల రూపాయలకు ఐదరాబాదులో అద్దిల్లు దొరికిద్దేటి నీకు?!"

"ఆ..ఇదో ఇందరబవనం...ఇట్టాటిల్లు దీపపు బుడ్డీ పట్టుకొని ఎతికినా మరేడా దొరకదు మరి. మూడో అంతస్తుపైన అగ్గిపెట్టిలాంటి రేకుల గది. పై కప్పు నిండా బొక్కలే. సినుకు పడితే సాలు..కొంపంతా తడిసిపోగలదు...రోజుకి పదిసార్లు పైకి కిందికి ఎక్కి దిగేసరికి పానాలు కొడిగట్టుకుపోతన్నాయి. తిన్నా తినకపోయినా ఆయిగా మనూళ్లో అయితే సొంత గుడిసెలో...కడుపులో కాళ్లు పెట్టుకుని పడుండేటోల్లంకదా" నిష్టూరంగా అంది సుబ్బులు.

"ఎర్రిమొహందానా! నువ్వూ నేనయితే ఆ పనే సేసేటోల్లం. పిల్లాడికి కూసింత కూడు పెట్టాలనేగదే కడుపు పట్టుకొని ఈడదాకా వచ్చాం... అయినా ఆడ పనులే వుంటే...ఈ కర్మ మనకెందుకు పట్టేది సెప్పు..."

"ఆ...పెడతానే వున్నాం పచ్చడి మెతుకులు..." వెక్కిరింపుగా నొక్కి పలికింది సుబ్బులు.

"సుబ్బీ... పచ్చడి మెతుకులంటే గుర్తొచ్చింది. పొద్దుట ఆడు వద్దంటన్నా ఇనకుండా ఆడినోట్లో పచ్చడి మెతుకులు ఎందుకు కుక్కినట్టు....?"

"ఇంకేవుంది మనకాడ...సికెన్నా...మటన్నా...సేపలా?" ముక్కు చీదుకుంటూ అంది సుబ్బులు.

"ఏందే ఇయ్యాల నీ మాట ...చేత..అంతా కొత్తగా ...ఇంతగా వుంది...ఎప్పుడూ వుండదాంటోనే గుట్టుగా లాక్కొచ్చేదానివి... ఇట్టా మాట్టాడతన్నావేటే..." అడిగాడు కోటయ్య కంగారుగా.. అసలేం జరిగిందో అన్న ఆరాటం అతని నోటి నుంచి వెలువడిన ప్రతి అక్షరంలోనూ ధ్వనించింది.

"ఏవుంది మావా జరగడానికి...అంతా మావూలే...బాగనే వుంది... ఈ ముదనష్టపు ముసురు మూలంగా ఇళ్లల్లో గిన్నెలు కడగడానికి కూడా పోలేకపోతుంటిని. ఇంకా తగ్గిద్ది...పోదాం అనుకుంటే ఆ జాడే లేకపాయె. తడిసైనా సరే పోయి ఎట్టాగో రెండిళ్లలో గిన్నెలు కడిగి కూసింత కూరో...నారో అడుక్కు తీస్కురావాల. పిల్లాడికి అద్దెనా తినిపియ్యకపోతే...కట్టం మావా" మాట మారుస్తూ...తెల్ల గోతాం పట్టా తల మీద వేసుకుంటూ అంది.

ఏమనుకున్నాడో ఏమో అతనుకూడా ఆ విషయం అంతటితో వదిలేసి...

"జాగరత్త సుబ్బీ. అసలే ఈ ఊళ్లో నాలుగు చుక్కల వానకే రోడ్లన్నీ నిండిపోతాయి. అట్టాటిది మిన్నుకి...మన్నుకి ఏకదాటిగా వాన కురుస్తోంది. ఇంకెట్టా వుండాయో రోడ్లు. కూడు లేకపోతే మానె. కాసేపాగరాదు" అన్నాడు దిగులుగా చూస్తూ భార్య వంక. తన జాగ్రత్తకోసం భర్త అన్న మాటలకు సుబ్బులు మనసు సంతోషంతో పొంగిపోయింది. ఆగుదామనుకున్నా...పిల్లాడి వంక చూశాక మాత్రం బయటికే నడవడానికి నిశ్చయించుకుంది.

ఈలోపు పిల్లాడు కదులుతూ... ఏదో కలవరిస్తున్నాడు. దాంతో ఇద్దరికీ భయం వేసింది. సుబ్బులు కంగారుగా వాడి దగ్గరకెళ్లి పొట్ట మీద చెయ్యేసి...

"ఏందిరా నాన్నా! ఏం కావాలా?!" అనడిగింది.

"నీ గోలేందే మద్దెలో.... ఆడేందో అంటుండాడుగా...అదేందో ఇనరాదూ..." అడిగాడు ఆత్రంగా కోటయ్య.

"అదేనయ్యా...నేనూ చూత్తన్నా..."
"అయ్యా...కోడి కూర...కావాల...కోడికూర...కోడి కూర.."
"ఏటే సుబ్బీ...కోడికూరా! ఇప్పుడదెక్కడి నుంచి తేవాలే?..."

"నువ్వూరుకోవయ్యా... పిల్లాడికి దాని మీద ఎంత మనసుంటే ఇంత నిద్రలోనూ అడుగుతాడు! ఎట్టాగైనా కోడికూర వండి పెట్టాల్సిందే నా తండ్రికి...." అంటూ వాణ్ణి గుండెలకు హత్తుకుంది ప్రేమగా.

"ఇప్పుడు ఏడనుంచి తెత్తావే...కోడికూర...ఆ దిక్కుమాలిన తాపీ పనికి పోతే...పై నుంచి కింద పడి కాలిరిగి నెల్లాళ్లైపోయె. ఆనాటి నుంచి ఈ నాటికి పైసా ఆదాయం లేకపోగా ఆస్పత్రి కర్సులు మీదబడే. అప్పటిబట్టి ...ఆ కొంపలో గిన్నెలు కడిగి..ఈ కొంపలో బట్టలుతికి...నువ్వే ఏదో నాలుగు మెతుకులు తెచ్చి పెడుతుంటే తింటన్నా ఈ పీతి కడుపుకి. ఇప్పుడీడి కోరికెట్టా తీరుత్తావంటా...!" తన దయనీయ పరిస్థితిని భార్య ముందు పరిచాడు.

"ఇద్దరం కష్టపడి పనిచేసిననాడే పదో పరకో పెట్టి కోడికాళ్లో...తోళ్లో... తెచ్చుకుని వండుకునేవాళ్లం. ఇప్పుడా రేట్లు మండిపోతన్నె. పైగా మనకి ఆదాయం లేకపోయె. ఇంక ఏడనుంచి తెచ్చిపెడతాం? కానీ మావా! ఎంత కష్టపడైనా సరే ...ఆడు కోరుకున్నట్టు కోడికూర వండి పెట్టాల్సిందే మావా..." అంటుండగానే ఆ ఉదయం జరిగిన సంఘటన గుర్తొచ్చింది.

❋ ❋ ❋

జలుబు చేసి నలతగా వున్న కొడుకును ఒంటరిగా వదిలి పనికి వెళ్లడం ఇష్టంలేకపోయింది సుబ్బులుకు. ఇంజనీరు గారింట్లో పనికి వెళ్తూ వాడినీ తీసుకెళ్లింది. పిల్లాడిని పనికి తీసుకురావద్దని యజమానురాలు పనిలో చేరే రోజే గట్టిగా చెప్పినా ... తప్పని సరి పరిస్థితుల్లో చంకనేసుకెళ్లింది వాడిని. ఇద్దరూ వెళ్లేసరికి ఇంజనీరు భార్య కొడుక్కి అన్నం పెడుతోంది. అదీ కోడికూరతో. వాడిది కూడా సుబ్బులు కొడుకు వయస్సే. ఐదేళ్లుంటాయి. వాడేమో "వద్దు మమ్మీ...చాలు మమ్మీ...ఇప్పటికే పొట్ట నిండిపోయింది" అంటూ అటూ ఇటూ పరిగెడుతున్నాడు. వాడిని పట్టుకొచ్చి బలవంతంగా "ఇదొక్కటే ముద్ద కన్నా... ఇటు చూడు చికెన్ లెగ్. ఎంత బావుంటుందో...తిను.. తింటే బోలెడంత బలం వస్తుంది కన్నా నీకు...ఏదీ ఆ...అను..." అంటూ నోట్లో పెట్టిందావిడ. వాడు అయిష్టంగా కిందకి ఊసేశాడు. ఇదంతా సుబ్బులు, సుబ్బులు కొడుకు వాకిట్లో నిలబడి చూడసాగారు.

సరిగ్గా ఆసమయానికి యజమానురాలి దృష్టి సుబ్బులు మీద...చంకలో వున్న పిల్లాడి మీద పడింది... కొడుకు నోట్లో ముక్క ఊసేదన్న కోపం వీరి మీద ప్రదర్శిస్తూ..."ఏమే. నీకు మొదటే చెప్పా కదా. ఇట్టా పిల్లా పీచూ తో పనికి రావద్దని. ఇదేమన్నా క్రష్షా. నువ్వు పని చేసినంత సేపు వాణ్ణి నేను చూడ్డానికి. పైగా ఉచ్చలు పోసి ఆగం చేస్తాడు. మేం ఏమైనా తింటుంటే గుటకలు మింగుతూ చూస్తాడు. ఛ... మీ ఇద్దరి దిష్టి తగిలి పిల్లాడు అన్నం ఊసేశాడు.. దరిద్రపు చూపు మీరూను. అదిగో వాడిని అట్టా పెద్ద గేటు ముందర కూర్చోబెట్టు... ఇంట్లోకి తీసుకురాకు. వెళ్లెళ్లు..." అంది చీదరింపుగా.

ఆ పిల్లాడికేమో వద్దన్నా కంచం నిండా అన్నం వుంది. తన పిల్లాడికేమో కావాలన్నా...మెతుకు లేదు...అట్టా ఎందుకో... సుబ్బులుకు అర్థంకాలేదు. దేనికైనా పెట్టిపుట్టాలి...అనుకుంటూ యజమానురాలి ఆజ్ఞను శిరసావహిద్దామని వెనుదిరిగింది. ఈలోపే ... సుబ్బులు కొడుకు అమ్మ గడ్డం కింద చెయ్యి పెట్టి..."అమ్మా...నాకూ కోడికూర కావాలి. నేనూ తింటా...ఇప్పుడే తింటా..." అంటూ మొండికేశాడు.

ఆ మాటలు వింటే అమ్మగారు ఇంకెంత తిడుతుందేమోనని వాడి నోరు మూసి మరీ బయట కూర్చోబెట్టి వచ్చింది సుబ్బులు.

గబగబా గిన్నెలు కడిగి... గదులన్నీ శుభ్రంగా ఊడ్చి..డెట్టాల్‌తో తుడిచి...ఆశగా...యజమానురాలి దగ్గరకెళ్లింది సుబ్బులు. కొడుక్కి ఒక్క కోడి ముక్కయినా గిన్నెలో వేసిస్తుందేమోనని ఆశగా చూసింది. ఊహూ...ఆమె చద్దన్నం మాత్రమే ఇచ్చి పంపేసింది. పసోడు నోరు తెరచి అడిగినందుకైనా కూర పెడితే బాగుండేదని ఎన్నిసార్లనుకుందో మనసులో లెక్కేలేదు. పిల్లాడు చంకలో కూర్చుని ఎన్నిసార్లు ఆ కూర గురించి అడిగాడో!

ఇంటికొచ్చాక ఆ చద్దన్నంలో పచ్చడి సుద్దేసి కలిపి పెడుతుంటే వాడు నోరే తెరవలేదు. తిననంటే తిననన్నాడు. మూతి బిగించేశాడు. పేదరికమే చేతగానితనంగా తయారై ఏమీ చేయలేని పరిస్థితిలో పుట్టుకొచ్చిన పిచ్చికోపంతో పిల్లాణ్ణి కొట్టి మరీ పచ్చడి కూడు తినిపించింది. వాడు 'వద్దమ్మా..కారం కూడు తిననమ్మా...మంటమ్మా' అని ఏడ్చి గోలచేసినా వినిపించుకోలేదు. మొండిగా... రాక్షసిలా ... యజమానురాలి మీది కోపంతో పచ్చడన్నం తినిపించింది కొడుకుతో.

దెబ్బలు తిని...ఏడ్చి ఏడ్చి పడుకుండిపోయాడు వాడు. కడుపున పుట్టిన బిడ్డలు నోరు తెరిచి 'అమ్మా ఇది కావాలి' అనడిగినప్పుడు అది కొనిపెట్టలేని పరిస్థితిలో ఏ తల్లి మాత్రం ఏం చేయగలదు. సుబ్బులూ అంతే. అదంతా గుర్తొచ్చేసరికి... సుడి తిరిగిన కన్నీటిని కొంగుతో తుడుచుకుంటూ బయటకు నడవబోయింది. ఒక్కసారి ఉరుములు... మెరుపులతో వాన మరింత పెద్దదైంది.

"సుబ్బీ... ఈ వానలో ఎట్టెల్తావే పనికి. పైగా ఈ కుంటి కాలితో పిల్లాణ్ణి పట్టుకోవడం మా కట్టం. ఇయ్యాల్టికి పోకపోతే మానె.." అన్నాడు బతిమాలుతున్నట్టుగా కోటయ్య. వాన జోరు చూశాక సుబ్బులు కూడా అతని మాట కాదనలేకపోయింది. నెత్తిమీద పట్టా తీసి కొడుకు పక్కన నడుం వాల్చింది. ముగ్గురూ ఖాళీ కడుపుతోటే నిద్రపోయారు.

❋ ❋ ❋

ఒనర్లకు పని వున్నప్పుడు వచ్చి చేయడానికి వీలుగా సుబ్బులు వాళ్ల గదికి కాలింగ్ బెల్ ఏర్పాటు చేశారు. ఉదయాన్నే అది గణగణా మోగింది. ఆ శబ్దానికి ఉలిక్కిపడి లేచింది సుబ్బులు. లేవగానే కొడుకు వైపు చూసింది ప్రేమగా. తండ్రి మీద కాలు వేసి అమాయకంగా నిద్రపోతున్నాడింకా... వాణ్ణి చూసి నవ్వుకుంది ప్రేమగా. తర్వాత భర్తను చూసింది. అతను ఆమెనే చూస్తున్నాడు.

"మావా...ఓనరమ్మ పిలుత్తోంది. ఓ మాలెల్లి ఏటో కనుక్కొత్తా...."
"ఏదో పనిబడుంటది. ఎల్లెల్లు సేసిరా... "

పది నిముషాల్లో రెడీ అయి కిందకెళ్లింది. వాకిట్లో కాలింగ్ బెల్ కొట్టి నిలబడింది. హాల్ కర్టెన్ గాలికి కదిలి లోపలి దృశ్యం కనిపించింది సుబ్బులుకు. గదంతా రంగురంగుల బూరలు, రిబ్బన్లతో అలంకరించి వుంది. కిందంతా సగంబడా వదిలేసిన పళ్లేలు...కూల్ డ్రింక్ సీసాలు...ఖాళీ ఐస్‌క్రీమ్ కప్పులు... పడి పొర్లుతున్నాయి. ఆ ఎంగిలి పళ్లేల్లో ఎన్ని మాంసం ముక్కలో తినలేక వదిలేసినవి. నిన్న తన కొడుకు ఒక్క కోడి ముక్క కోసం ఏడ్చి ఎన్ని దెబ్బలు తిన్నదీ గుర్తొచ్చి సుబ్బులు మనసు బాధతో మూలిగింది ఒక్కసారిగా.

ఈలోగా ఇంటావిడ వచ్చి కళ్లు నులుముకుంటూ..."నిన్న చింటూ పుట్టినరోజు సుబ్బీ. రెండు మూడు పోతులు నరికి గ్రాండ్‌గా చేద్దామనుకున్నా...ముదనష్టపు వాన మూలంగా కుదర్లా. అందుకే హోటల్ నుంచి తెప్పించాల్సొచ్చింది. గెస్ట్‌లంతా కార్లలో వచ్చేవారేకదా అనుకుంటే... అనుకున్నంత మంది రాలేదు. బోలెడంత మిగిలిపోయింది. ఇదిగో చూశావుగా...గదులన్నీ ఊడ్చి సర్ఫ్‌తో కడిగేయ్. గిన్నెలు తోమేయ్. ఆ మిగిలినవి నువ్వు తీసుకెళ్లు " అంటూ పురమాయించింది.

తన కొడుకు కోరిన కోడికూర అక్కడ చాలా వుంది. వాడి కోరిక తీర్చగలుగుతున్నందుకు సుబ్బులు హృదయం సంతోషంతో పొంగిపోయింది. ఆ ఆనందంలోనే ఇల్లంతా అద్దంలా శుభ్రంగా చేసేసరికి మధ్యాహ్నం పన్నెండైంది. మిగిలిన పదార్థాలు గిన్నెలకు సర్దుకుని...హడావిడిగా పైకెళ్లింది. వాటిని కొడుకు పక్కనే పెట్టి... వాణ్ణి కుదుపుతూ...

"ఒరే పిచ్చి సన్నాసీ...నిన్న ఎన్ని దెబ్బలు తిన్నావురా కోడికూర కోసం. ఇదిగోరా ఇయ్యాల నీ కడుపుకు పట్టినంత తినరా...ఇదిగో సూడు...అమ్మ తెచ్చిందిరా నీకోసం..." అని ఎన్నిసార్లు వాణ్ణి కుదిపినా లేవట్లా...అనుమానంతో పరిశీలనగా చూస్తే ఏముంది పిల్లాడి ఒళ్లు పొయ్యిమీది పెనంలా కాలిపోతోంది... ఇంక ఏం తింటాడు? ఆ ఆలోచన రాగానే ఒక్క పెట్టున ఏడుపొచ్చింది సుబ్బులుకు...నేలమీద పడి బిగ్గరగా రోదించింది. మనసులోనే తన పేదరికాన్ని తిట్టుకుంది.

❋



మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)
తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

జరిగినకథ:

టెంటులో బాధతో మెలికలు తిరిగిపోతున్నాడు బిగ్ ఫూట్. ఊపిరి తీసుకున్నప్పుడల్లా గుండె పగిలిపోతుందేమోనన్నంతంత నొప్పిగా వుంది. రక్షణగా ఘోస్ట్ షర్టులు తొడుక్కుని, ప్రవక్తనే నమ్ముకున్న మిన్నెకాంజూలు కూడా సైనికులను చూసి భయంతో వణికిపోతున్నారు. పద్నాలుగేళ్ల క్రితం, లిటిల్ బిగ్‌హార్న్ వద్ద, వీళ్లలో కొందరు మోయ్‌లాన్, వార్నమ్, వాలస్, గాడ్‌ఫ్రే, ఎడ్గర్లీ లాంటి సైనికాధికారుల్ని చిత్తుగా ఓడించి వుంటారు. వాళ్లందరూ ఇప్పుడు తమ మీద ప్రతీకారం తీర్చుకోరు గద.

అమెరికన్ దేగ

(73వ భాగం)

"మరుసటి రోజు ఉదయం ఒక బ్యూగుల్ శబ్దం వినిపించింది. ఆ వెంటనే, గుర్రాలను అధిరోహించిన సైనికులు మమ్మల్ని చుట్టుముట్టారు. పురుషులందరూ మైదానం మధ్యకు వచ్చి నిల్చోవాలనీ, ఆ దర్వాత, పైన్‌రిడ్జ్ ఏజెన్సీకి వెళ్లాలని ప్రకటించారు. బిగ్‌ఫూట్‌ను కాంప్‌లోంచి తీసుకొచ్చి టెంటు ముందర కూర్చోబెట్టారు. అనేక మంది వృద్ధులు అతని చుట్టూ మూగారు" అని చెప్పాడు బిగ్‌ఫూట్‌కు నమ్మకస్తుడైన ఒక యోధుడు వాసుమాజా. తర్వాతి రోజుల్లో ఇతడు తన పేరు డెవీ బియర్డ్‌గా మార్చుకున్నాడు.

"బ్రేక్‌ఫాస్ట్ కోసం ఎండురొట్టె పంచిన తర్వాత, ఇండియన్ల నుండి ఆయుధాలు స్వాధీనం చేసుకునే కార్యక్రమం ప్రారంభమైంది. "అందరం స్వచ్ఛందంగా మా తుపాకులు సైనికులకిచ్చాం" అని గుర్తుచేసుకున్నాడు వైట్‌లాన్స్. కానీ ఆయుధాలన్నీ వాళ్లు సరెండర్ చెయ్యలేదనుకున్నారు అధికారులు. కొందరు టెంటులలోకెళ్లి ఇండియన్లు కట్టిపెట్టుకున్న మూటలన్నీ చించి చూశారు. మా గొడ్డళ్లూ, కత్తులూ, ఇతర వస్తువులూ ఆయుధాలతో పాటు పోగేశాడు" అన్నాడు డాగ్‌చీఫ్.

అయినా, అధికారులకు తృప్తి కలగలేదు. ఇండియన్లను కప్పుకున్న బ్లాంకెట్లు తొలగించమని, ఒళ్లంతా తడిమి చూశారు. మిన్నెకాంజూల మొహాలు కోపంతో ఎర్రబడ్డాయి. కాని భూతవైద్యుడు ఎల్లో బర్డ్ మాత్రమే నిరసన తెలిపాడు. కాసేపు ఘోస్ట్ డాన్స్ చేసి, కొన్ని పవిత్ర గీతాలు ఆలపించి, ఘోస్ట్ షర్టులు వున్నంతకాలం సైనికుల తూటాలు కూడా తమనేమీ చెయ్యలేవని అభయమిచ్చాడు.

"బుల్లెట్లు మీ వైపుకు కూడా రావు. ఈ విశాలమైన ప్రయరీ మైదానాల్లో అవి మీ దిశగా రానేరావు"

సైనికులకు మరో రెండు రైఫిళ్లు దొరికాయి. అందులో ఒకటి బ్లాక్ కమోటే (అనబడే మిన్నెకాంజూ)కి చెందిన మించెస్టర్‌గన్. అతను చాలా ఎక్కువ ధర చెల్లించి దాన్ని కొన్నాననీ, అది తనకే చెందుతుందనీ బిగ్గరగా అరిచాడు బ్లాక్ కమోటే. అతడు బధిరుడని (అనేక సంవత్సరాల తర్వాత) చెప్పాడు డెవీ బియర్డ్, "బలవంతంగా లాక్కోకుండా వుంటే, అతడే స్వయంగా ఇచ్చేవాడు. కాని అతని చేతులు మెలిపెట్టి పక్కకు తోసేశారు. అప్పటికే అతడు ప్రతిఘటించలేదు. ఆగన్ ఎవరికీ గురిపెట్టలేదు కూడాను. దాన్ని కింద పెట్టక తప్పదని అతనికీ తెలుసు. అప్పుడు, అకస్మాత్తుగా, సైనికులు దాన్ని లాక్కున్నారు. ఆ పెనుగులాటలో తుపాకీ పేలింది. పెద్ద చప్పుడైంది. ఎవరు కాల్చారు? ఎవరికి గురిపెట్టారు? వగైరా వివరాలు తెలియవు"

"ఆ తర్వాత కాన్వాస్ చీలినట్టుగా శబ్దం వినిపించింది- పిడుగు పడి చిరిగినట్టు-" అంటూ గుర్తు చేస్తుకున్నాడు రఫ్‌వెదర్.

"బ్లాక్ కామెటీ ఒక క్రేజీ యువకుడు. దారి తప్పిన వాడనే చెప్పవచ్చు. మొత్తం మీద, మొదట తుపాకీ పేలిన వెంటనే సైనికులు విచక్షణా రహితంగా కాల్పులు ప్రారంభించారు" అని చెప్పాడు టర్నింగ్ హాక్.

తూటాల వర్షం ప్రారంభమైన తొలి క్షణాలలో చెవులు పగిలిపోయేటంత శబ్దం వచ్చింది. వాతావరణమంతా పొగతో నిండింది. అసలే కొస ప్రాణాలతో వున్న బిగ్‌ఫూట్ నెత్తుటి మడుగులో కలియబడుతున్న చప్పుడు వినిపించింది.

ఆత్మ రక్షణ కోసం చేతికి దొరికిన కత్తులు, గదలు, పిస్తళ్లు వుపయోగించారు ఇండియన్లు. ఆయుధాలున్న వాళ్లు కొందరు పారిపోవటానికి కూడా ప్రయత్నించారు. కాని ఎవరికీ ఆ అవకాశం ఇవ్వకుండా హాచ్‌కిస్ గన్‌లు, అగ్నిగోళాలు కురిపించాయి. సెకండు కొక గుండు తగిలిన ఇండియన్ క్యాంపు కాలి బూడిదైంది. ష్రాప్‌నెక్‌తో టిపీలు పీలికలుగా చీరుకుపోయాయి. పురుషులు, స్త్రీలు, పిల్లలు, ఎవరూ మిగల్లేదు.

"మేం పారిపోవటానికి ప్రయత్నించాం. కాని మమ్మల్ని దున్నలను కాల్చినట్టు కాల్చారు. తెల్లవాళ్లలో కూడా కొందరు మంచివాళ్ళుండక పోరు కాని, ఈ సైనికులు మాత్రం బాగా నీచుల్లా వున్నారు. ఇండియన్ సైనికులు, తెల్లవాళ్ల పిల్లల్ని అలా కాల్చి చంపరు" అన్నాడు లూయీ వీసెజ్ బేర్.

"నేను పరిగెత్తాను. మేం ఒక గుంతను దాటటానికి

ప్రయత్నిస్తున్నప్పుడు మా తాతా, అవ్వా, తమ్ముడూ తూటాలు తగిలి అక్కడికక్కడే మరణించారు. నాకూ తొడలో, కుడి చేతి మణికట్టుకూ తగిలాయి గుళ్లు. నడవలేక తూలిపడ్డాను. ఒక సైనికుడే నన్ను పక్కకు తీసుకెళ్లి రక్షించాడు. మరో అమ్మాయి వచ్చి మీద బ్లాంకెట్ కప్పింది" అని ఆనాటి అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడు హకిక్టావిన్.

తుపాకులు శాంతించే సరికి, బిగ్‌ఫూట్, సగం మంది అతని అనుచరులూ నేలకొరిగారు. అనేకులు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు 153. వీళ్ళందరూ వెంటనే మరణించలేదు. కొంత దూరం పాకుతూ వెళ్లి సహాయం చేసే వాళ్లు లేక రక్త స్రావంతో ప్రాణాలొదిలారు. మరొక అంచనా ప్రకారం మృతుల సంఖ్య 350 మంది పురుషులు, స్త్రీలు, పిల్లలు 25 మంది సైనికులూ మరణించారు. ముప్పై తొమ్మిది మందికి గాయాలయ్యాయి. ఇందులో కొందరు పొరబాటున తగిలిన తమ వాళ్ల బులెట్లకే బలయ్యారు.

గాయపడిన అశ్వికులను పైన్‌రిడ్జికి చేర్చిన తర్వాత, మరికొందరు సైనికులు ఊండెడ్‌నీ యుద్ధ రంగానికెళ్లి ఇంకా ప్రాణాలతో వున్న ఇండియన్లను వ్యాగన్లలోకి ఎక్కించారు. మరి కాసేపట్లో మంచు తుఫాను రాబోతున్న సూచనలు కనిపించటంతో మృతదేహాలను అక్కడే వదిలేశారు. తుఫాను తర్వాత, ఖననం చెయ్యటానికి ఊండెడ్‌నీకి వచ్చిన బృందానికి, మంచులో వివిధ వికృతాకారాలలో గడ్డకట్టుకుపోయిన శరీరాలు (బిగ్‌ఫూట్‌తో సహా) కనిపించాయి.

గాయపడిన సియోలు (నలుగురు పురుషులు, నలభై ఏడు మంది స్త్రీలు, పిల్లలు) చీకటిపడిన తర్వాత వ్యాగన్లలో పైన్‌రిడ్జికి చేరుకున్నారు.

అప్పటికే బారక్సు సైనికులతో నిండిపోవటంతో, ఆగడ్డ కట్టే చలిలో, వీళ్లను వ్యాగన్లలోనే ఆ రాత్రంతా ఆరుబయట వుంచారు. చివరికి, ఒక మతప్రచారకుల బృందం వచ్చి, అక్కడున్న బెంచీలు తీసి గడ్డిపరిచి కొంత వుపశమనం కల్పించింది.

అది 1890లో క్రిస్మస్ తర్వాతి నాల్గవరోజు, చీరుకుపోయి, నెత్తురోడుతున్న దేహాలు కొవ్వొత్తుల వెలుగుతో నిండిన చర్చి మాల్లోకి ప్రవేశించినప్పుడు, అక్కడి ఆకుపచ్చ అలంకరణలు అందరి మనసులనూ దోచుకున్నాయి. చర్చి వేదిక మీద గోడకు వేళ్లాడుతున్న ఒక బ్యానర్ మానవాళిని ఆశీర్వదించింది.

"ఈ లోకంలో శాంతి వర్ధిల్లాలి
మనుషులలో సోదరభావం నెలకొనాలి"

ఆ క్షణాన మా చరిత్ర ముగిసిందని గ్రహించలేదు. ఈ వృద్ధాప్యంలో, జీవిత శిఖరాన నిలబడి పరిశీలిస్తే తెల్లవాళ్ల కసాయి చేతుల్లో మరణించిన స్త్రీలు, పిల్లల మృతదేహాల గుట్టలు, మైదానాల నిండా వెదజల్లినట్టుగా పడివున్న ఆ లేత శరీరాలే కనిపిస్తాయి. ఆ నెత్తుటి మడుగులో పడి, మంచు తుఫానులో గడ్డకట్టుకుపోయింది. మరొకటి కూడా వుంది. మా జాతి ప్రజల కల. అది కూడా ఇక్కడే మరణించింది. అది చాలా అందమైన కల. జనాన్ని కలిపి వుంచిన బంధం విరిగి ముక్కలైంది. ఈ దేశానికి ఇక కేంద్రబిందువంటూ ఏమీ మిగల్లేదు. పవిత్ర వృక్షం నేల కూలింది.

-బ్లాక్ ఎల్క్.

(అయిపోయింది)

మరి కాసేపట్లో మంచు తుఫాను రాబోతున్న సూచనలు కనిపించటంతో మృతదేహాలను అక్కడే వదిలేశారు. తుఫాను తర్వాత, ఖననం చెయ్యటానికి ఊండెడ్‌నీకి వచ్చిన బృందానికి, మంచులో వివిధ వికృతాకారాలలో గడ్డకట్టుకుపోయిన శరీరాలు (బిగ్‌ఫూట్‌తో సహా) కనిపించాయి.

రచయిత డీ బ్రౌన్

పొట్టి అబ్బి.... పొడవు కాళ్ల అమ్మి

బాగా పొట్టి వాళ్లు...బాగా పొడవు వాళ్లు ఒక చోట చేరితే ...పక్కపక్కన నిలబడితే ఎలా వుంటుంది?! చూడ్డానికి రెండు కళ్లూ చాలవు కదూ. ఆ అనుభూతిని మాటల్లో వర్ణించలేం కూడా. ఫొటోలో చూసిన మనకే ఇలా వుంటే నిజంగా చూసినవారి పరిస్థితి ఎలా చెప్పాలి.

సరే మన ఫీలింగ్స్ కాసేపు పక్కన పెట్టి అసలు పాయింట్‌కొచ్చేద్దాం. ఈ పొట్టి బుడంకాయ పేరు పింగ్‌పాంగ్. ఎత్తు ఎంతంటారా! సింపుల్‌గా 29.37 అంగుళాలే. అయితే వయసు మాత్రం 20. ఉత్తర చైనా వాసి. ఈ ఏడాది కూడా ప్రపంచంలోకెల్లా పొట్టివాడిగా గిన్నిస్ బుక్ రికార్డుల్లో అతని పేరే వుంది. ఇకపోతే..బుడ్డోడి పక్కన పొడవుగా పోజిచ్చిన అమ్మడు స్వెట్లానా. ప్రపంచంలోకెల్లా పొడవాటి కాళ్ల అమ్మడిగా రికార్డులకెక్కింది. ఇంతకీ ఈవిడగారి కాళ్ల పొడవెంతో తెలుసా? సింపుల్‌గా51.96 అంగుళాలే!

ఇంక వీరిద్దరి కలయిక గురించి చెప్పకోవాల్సింది కొద్దిగా వుంది. గిన్నిస్ ప్రపంచ రికార్డుల పుస్తకాన్ని ఆవిష్కరించడానికి వీరిద్దరూ ఈ మధ్యే లండన్ వచ్చారు. అప్పటివే ఈ ఫొటోలు. కన్నుల పండుగగా వున్నాయా!



రాహుల్ అంటే తెలీకపోవచ్చు. 'హ్యాపీ డేస్'లో టైసన్‌గా నటించిన కుర్రాడంటే వెంటనే గుర్తుకొచ్చేస్తాడు. 'శ్రావ్స్... శ్రావ్స్... అంటూ వెంటపడుతూ... తన్నులు తింటూ... చెదరని చిరునవ్వుతో ఆకట్టుకున్నాడు కదూ! తొలి చిత్రంతో ఆకట్టుకున్న రాహుల్ సోలో హీరోగా 'రెయిన్‌బో' అనే చిత్రంలో నటించాడు. 'మనసంతా నువ్వే' ఫేం వి.యన్. ఆదిత్య దర్శకత్వం వహించారు. ఈ చిత్రం తన ఇమేజీను పూర్తిగా మార్చేస్తుందని చెబుతున్నాడు. చిత్ర విశేషాలు తెలుపుతూ...

పూర్తిగా మార్చేస్తుంది

'రెయిన్‌బో' క్యారెక్టర్ 'హ్యాపీడేస్' పాత్రకు భిన్నంగా ఉంటుందా?

ప్రేక్షకులింకా 'హ్యాపీ డేస్'లోని నా పాత్ర పేరే (టైసన్) గుర్తుపెట్టుకున్నందుకు ఆనందంగా ఉంది. 'రెయిన్‌బో'లో 'శ్యామ్'గా నటిస్తున్నాను. 15 నుంచి 25 సంవత్సరాల వయసు గల వారు తమలో నన్ను ఐడెంటిఫై చేసుకుంటారు. అది ప్రేమలో పడే వయసు కదా! అన్ని ఎమోషన్ల కలబోతగా నా పాత్ర ఉంటుంది. రెండో చిత్రంలోనే ఇన్ని రకాల భావాలు పలికించే అదృష్టం దక్కింది. నటుడిగా నిరూపించుకోవడానికి స్కోప్ ఉన్న క్యారెక్టర్ ఇది.

'రెయిన్‌బో'లో అవకాశం ఎలా వచ్చింది?

దర్శకుడు వి.యన్. ఆదిత్యగారు గత ఏడాది డిసెంబర్‌లో నన్ను పిలిపించి 45 నిముషాల్లో కథ చెప్పారు. ఇలాంటి మూల కథతో ఇండియన్ స్క్రీన్‌పై ఇంతవరకూ సినిమా రాలేదు. ఇంటర్వెల్ సీన్ డిఫరెంట్‌గా అనిపించింది. ఫైనల్ కాపీ చూశాక సినిమా అద్భుతంగా వచ్చిందనిపించింది. సినిమా ఆద్యంతం రియలిస్టిక్‌గా ఉంటుంది. ప్రతి సన్నివేశం ప్రాధాన్యత సంతరించుకుంది. స్క్రిప్ట్‌లో ఎలాంటి లోపాలూ లేకుండా పకడ్బందీగా రూపొందించారు. మీకేమైనా లోపాలు కనిపిస్తే మొహమాటం లేకుండా వెంటనే చెప్పమని దర్శకుడు అనేవారు.

మీ సహ నటీనటుల గురించి...

ఇందులో ప్రతి పాత్రా ప్రధానమైనదే. మేము హీరోహీరోయిన్లమని ఎప్పుడూ భావించలేదు. ఓ మంచి కథను నడిపించే క్యారెక్టర్స్ మాత్రమే. సింధు మీనన్ నా కన్నా సీనియర్. దక్షిణాది భాషా చిత్రాలన్నింటిలోనూ నటించిన అనుభవం ఆమెది. మంచి పెర్ఫార్మెన్స్ ఇచ్చింది. సోనాలీ చౌహాన్ ఓ హిందీ చిత్రంలో నటించింది. మంచి ఫ్రెండ్ అయింది. ఓర్పుతో తెలుగు డైలాగ్స్ అర్థం చేసుకుని బాగా నటించింది. మొదట్లో పల్లెటూరు అమ్మాయిగా కనిపించినా గ్లామర్ వైపు ఆమె పాత్ర సాగుతుంది.

నటుడిగా రాణించడానికి ఎలాంటి కృషి చేశారు?

'రెయిన్‌బో' షూటింగ్ ప్రారంభానికి ముందు రెండు నెలలు గ్యాప్ వచ్చింది. ఆ సమయంలో రోజుకి ఐదారు గంటలు వి.యన్. ఆదిత్య, రచయితలు పరుచూరి బ్రదర్స్‌తో కూర్చునేవాణ్ణి. ఎలా మాట్లాడాలి? హావభావాలు ఎలా పలికించాలో నేర్చుకున్నాను. నిజ జీవితంలో ప్రవర్తించే దాంట్లో 80 శాతం ఇవ్వగలిగితే చాలని దర్శకుడు అనేవారు. ప్రకాష్‌రాజ్‌తో ఇంటర్వెల్ సీన్, సింధు మీనన్‌తో క్లైమాక్స్ సీన్‌లో బాగా నటించాననుకుంటున్నాను. ఆ క్రెడిట్ అంతా దర్శకుడికే చెందుతుంది.

మీ చదువు ఎంతవరకు వచ్చింది?

'హ్యాపీ డేస్' షూటింగ్‌కు ముందు బి.బి.ఏ (బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) పూర్తి చేశాను. పై చదువులు చదవాలన్న ఆసక్తి లేదు.

అయితే నటనను సీరియస్‌గా తీసుకున్నారన్న మాట?

అవును. చాలా చిత్రాల్లో నటించాలనుంది. మా ఇంట్లో నేనొక్కడినే మగపిల్లవాణ్ణి. నాన్నగారి బిజినెస్‌ను చూసుకోవాల్సిన భారం నాపై ఉంది.

మీ తదుపరి ప్రాజెక్ట్?

ఇంకా ఏదీ అంగీకరించలేదు. 'రెయిన్‌బో' రిలీజ్ వరకూ వెయిట్ చేయమని ఆదిత్య చెప్పారు. ఈ చిత్రం నా ఇమేజ్‌ను పూర్తిగా మార్చేస్తుందన్న నమ్మకం ఉంది. ఎన్ని చిత్రాలు చేశామా అని కాకుండా మంచి చిత్రాల్లో నటించడానికే ప్రాధాన్యమిస్తాను.

'హ్యాపీ డేస్'లో మీరు మొత్తం ఎనిమిది మంది. అందులో నిఖిల్, వంశీ సోలో హీరోలుగా నటించిన చిత్రాలు 'అంకిత్, పల్లవి అండ్ ఫ్రెండ్స్', 'కాల్ సెంటర్' రిలీజై ఫ్లాప్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఎలా ఫీల్ అవుతున్నారు?

అలాంటిదేమీ లేదు. 'రెయిన్‌బో'ను మంచి స్క్రిప్ట్‌తో దర్శకుడు అద్భుతంగా మలిచారు. ఓ మంచి సినిమాలో నటించినందుకు ఆనందంగా ఉంది. సినిమా రిలీజ్‌కు ముందే 100 మంది స్టూడెంట్స్‌కు చూపించాం. సినిమాలో ఫీలింగ్ ఉందంటూ అభినందించారు.

హాబీస్...

తినడం... సినిమాలు చూడడం... టైం దొరికినప్పుడల్లా క్రికెట్ ఆడడం. క్రికెట్‌లో నేను ఆల్ రౌండర్‌ని.

క్రికెటర్లలో ఎవరంటే అభిమానం?

సచిన్, ద్రావిడ్. ఈ మధ్య కాలంలో ధోనీ.

బాబా ఘనూష్

కావలసిన పదార్థాలు

(తెల్ల) గుత్తివంకాయ- 500 గ్రా
వెల్లుల్లి ముక్కలు- 2 చెంచాలు
నిమ్మరసం- 3 చెంచాలు
ఉల్లి తరుగు- 1/4 కప్పు
టొమోటో-1/4 కప్పు ముక్కలు(విత్తనాలు తీసేయాలి)
మిరియాల పొడి- 1/4 చెంచా
కొత్తిమీర- 3 చెంచాలు, నువ్వు పప్పు- 3 చెంచాలు
ఆలివ్ ఆయిల్-సరిపడ

తయారు చేసే విధానం

వంకాయను సన్నని మంటమీద లోపల మగ్గి పూర్తిగా ఉడికేలా కాల్చుకోవాలి. తరువాత పైన పొట్టు తీసివేసి గుజ్జుగా చేసుకోవాలి. ఈ గుజ్జుకి ఉప్పు, నిమ్మరసం, ఉల్లిముక్కలు, టొమోటా ముక్కలు, మిరియాల పొడి, కొత్తిమీర, కొంచెం వేపిన నువ్వు పప్పు, ఆలివ్ ఆయిల్ వేసి బాగా కలపాలి. దీనికి కొంచెం ఆయిల్‌లో వేసిన ఆవాలు కూడా జత చేసి వేడిగా రైస్‌లోకి వడ్డించాలి.

దాల్ సబ్జి

కావలసిన పదార్థాలు

మైదా లేదా గోధుమపిండి- 1 కిలో
బొంబాయి రవ్వ- 100 గ్రాములు
నీళ్లు-సరిపడ
మినుములు- 1/2 కిలో
ఉప్పు - రుచికి సరిపడ, కారం-1/2 చెంచా
సోంపు- 4 చెంచాలు, బొంబాయి రవ్వ- అరకిలో

తయారు చేసే విధానం

మైదా, రవ్వ కొంచెం ఉప్పువేసి సరిపడ నీరు పోసి పిండి తయారు చేసుకోవాలి. మినుములను ఒక రాత్రంతా నీటిలో నానబెట్టి శుభ్రం చేసి ఉడికించాలి. నీరంతా ఫిల్టర్ చేసి మినుములను మిక్సీ చేసుకోవాలి. ఆ మిశ్రమానికి ఉప్పు, కారం, సోంపు, రవ్వ, అజ్‌మెయిన్ జత చేసి అన్నీ కలిసేలా బాగా కలపాలి. మైదా పిండిని నిమ్మపండంత తీసుకొని అరచేతిలో పల్చగా ఒత్తుకొని దాంట్లో మినప మిశ్రమం ఉంచి రోల్ చేస్తూ కవర్ చేసి అన్ని బాల్స్ రెడీ చేసుకోవాలి. ప్యాన్‌లో నూనె వేసి కాగిన తర్వాత బాల్స్‌ని వేసి సన్నని మంట మీద ఐదు నిమిషాలు ఉడికించి తరువాత మీడియం మంట మీద ఎర్రగా వేపి వేడిగా సర్వ్ చేసుకోవాలి.



చేప కుర్మా

కావలసిన పదార్థాలు

చేపలు- అరకిలో, లవంగాలు- అయిదు
వెల్లుల్లి- అయిదు రెబ్బలు, దనియాలు-స్పూను
యాలకులు- నాలుగు, దాసిన చెక్క - రెండు ముక్కలు
నూనె- 100 గ్రాములు, కొత్తిమీర- ఒక కట్ట
ఉప్పు-సరిపడా, కారం- రెండు స్పూన్లు
పచ్చిమిరపకాయలు- మూడు, ఉల్లిపాయలు- రెండు
పెరుగు- ఒక కప్పు, పసుపు- చిటికెడు

తయారు చేసే విధానం

చేపలను శుభ్రం చేసుకొని ముక్కలుగా కోసుకోవాలి. ఉప్పు-వెల్లుల్లి- అల్లం, కారం బాగా నూరుకొని ఈ మిశ్రమాన్ని చేపలకు పట్టించాలి. ఒక కప్పు పెరుగును అందులో వేసి మూతపెట్టండి. ఉల్లిపాయలు-పచ్చిమిర్చి, కొత్తిమీరని విడి విడిగా ముక్కలుగా చేసుకోవాలి. దనియాలు-వెల్లుల్లి బాగా నూరి ముద్ద చేసుకోండి. ఒక బాణలిలో నూనె పోసి బాగా కాగాక పెరుగులో కలిపి ఉంచిన చేప ముక్కలు వేయాలి. అయిదు నిమిషాలు పోయాక మసాలా ముద్దను ఉల్లి-పచ్చిమిర్చి ముక్కల్ని బాగా కలియబెట్టండి. కుర్మా తయారవగానే కొత్తిమీర వేసి దింపేయాలి.

మహారాణి చికెన్

కావలసిన పదార్థాలు

కోడి- పావుకిలో
టొమోటో గుజ్జు- 100 గ్రాములు
అల్లం ముక్కలు- 1/2 కప్పు
వెన్న- 25 గ్రాములు, పెరుగు- 2 స్పూన్లు
ఎర్రరంగు- కొద్దిగా
గరం మసాలా- 1 స్పూన్
పసుపు- చిటికెడు, ఉప్పు- రుచికి సరిపడ

తయారు చేసే విధానం

ముందుగా కోడిని శుభ్రం చేయాలి. అల్లం, వెల్లుల్లిని ముద్దగా నూరాలి. పెరుగు, అల్లం, ఎర్రరంగు, పసుపు, మసాలా పొడిని బాగా చికెన్‌కు పట్టించి బాగా నాననివ్వాలి. ఊరిన కోడిని నిప్పులపై అన్ని వైపులా బాగా కాల్చండి. కాల్చిన కోడిలో ఎముకలన్ని తీసెయ్యాలి. బాణలిలో వెన్న వేసి పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర, టొమోటో గుజ్జు, ఉప్పు వేసి బాగా మగ్గపెట్టాలి. ఎముకలు తీసిన కోడికి ఈ రోస్ట్ పూసి సన్నని సెగపై చిక్కగా ఉండేలా వేపాలి.



పేపర్ డాల్ చేసేద్దాం



హాలో...బుజ్జాయిలూ... దసరా సెలవులు ఇచ్చేశారుకదా. ఏం చేస్తున్నారు? బోర్‌గా వుందా? మేం వుండగా దిగులెందుకు చిన్నారులూ. ఈ వారం మీకు పేపరుతో బొమ్మలు చేయడం ఎలాగో నేర్పుతాం. ఆడుతూ పాడుతూ నేర్చేసుకోండే. మరి పేపర్‌డాల్స్ చేయడం ఎలాగో? ఏమేం కావాలో? చదవండి మరీ...

ఏమేం కావాలి...

చార్టు, పెయింట్లు, కదిలే కళ్లు (ఫ్యాన్సీ షాపుల్లో వుంటాయి), కార్డ్‌బోర్డు, రూలర్, పెన్సిల్, కత్తెర, గమ్ (ఫెవికాల్), స్కెచ్ పెన్నులు.

ఎలా చేయాలంటే...

ముందుగా చార్టు తీసుకొని మీకు ఎంత బొమ్మ కావాలనుకుంటే అంత సైజులో కత్తిరించుకోండి. రెండు చివర్లను బాగా దగ్గరగా పెట్టి గమ్‌తో అతికించండి. ఇప్పుడు రెండు వైపులా రంధ్రాలున్న గొట్టంలా కనిపిస్తుంది. ఇప్పుడు బొమ్మ సైజును బట్టి దాని వెంట్రుకల ఎంత పొడవుండాలో చూసుకోవాల్సివుంటుంది. దాని ప్రకారం చార్టులో కొద్దిగా ముక్క కత్తిరించి చీలికలుచీలికలుగా కత్తిరించుకోవాలి దాన్ని చార్టు గొట్టం పైభాగంలో అతికించాలి. అచ్చం బొమ్మలో చూపించినట్టే చేయాలని మరువకండే. బొమ్మలో మధ్యలో విదేశీ అమ్మాయి వుందికదా. ఆమె వెంట్రుకలు మెలితిరిగి వున్నాయి గమనించారా? అలా రావాలంటే మాత్రం చీలికలుగా కత్తిరించాక చార్టు పీసులను పెన్సిల్‌కు గుండ్రంగా చుట్టి కాసేపు పట్టుకోవాలి. తర్వాత వాటిని గమ్‌తో అతికించాలి. తర్వాత వెంట్రుకల కింది భాగంలో గొట్టం మీద స్కెచ్ పెన్నులతో నోరు, ముక్కు గీయాలి. కదిలేకళ్లను అతికించాలి. తర్వాత చార్టు గొట్టాం కింది భాగం చుట్టూ...కొద్ది కొద్దిగా కత్తిరించాలి. వాటిని వెనక్కి వంచాలి. ఇప్పుడు వీటికి గమ్ రాసి ఏదైనా టేబుల్‌మీదో, షోకేస్‌లోనో అతికించాలి. అంతే చక్కటి పేపర్ డాల్ రెడీ. చాలా బాగుంటాయి. ఇలా కాకుండా మరోలా కూడా వీటిని అలంకరించవచ్చు. కార్డు బోర్డు ముక్కను గుండ్రంగా కత్తిరించుకొని దాని మీద ఈ పేపర్‌డాల్స్‌ను అతికించాలి. అప్పుడు వాటిని ఒక చోటి నుంచి మరో చోటికి మార్చుకునే అవకాశం కూడా వుంటుంది. మరి చేసేస్తారుగా.

- కె. సాహి

గుర్రం ఎక్కడ?

నేస్తాలూ... ఇక్కడ గుర్రం వుంది. కనిపించిందా? అదేంటి కప్ప వుంటే గుర్రం వుందంటారు? అని కొందరు కోపంగా చూస్తున్నారు. కానీ బుజ్జాయిలూ...ఒక్కోసారి మనం ఎంత చూసినా కళ్ల ముందున్న విషయాన్ని గుర్తించలేం. అందుకు ఉదాహరణే ఈ బొమ్మ. ఎలాగంటారా? ఈ కప్పలోనే గుర్రం వుంది. పేజీని అటూ ఇటూ తిప్పి చూడండి. మీకే తెలుస్తుంది.



పది ప్రాణులున్నాయా!

హాయ్ పిడుగులూ! ఇవాళ మీకో కష్టమైన పరీక్ష పెడుతున్నాం. ఇదిగో ఈ ఫొటోలో మొత్తం పది ప్రాణులున్నాయి. అంటే మనుషులు కానివ్వండి! ఇంకేమైనా కానివ్వండి. మరి కనిపించాయా! లేదా? బాగా పరిశీలనగా చూసి చెప్పండి. కనిపెట్టలేకపోతే మాత్రం మా జవాబు చూడండే.

బాలనేస్తాలు

నేర్చుకుందామా!



కు... కు... కుందేలు కనిపించిందా?

'ఇవాళ అన్నీ ఇలాగే అడుగుతున్నారు. మాకేం కనిపించడంలేదు. మీరేమో వుందంటున్నారు. ఇది చీటింగ్' అనుకుంటున్నారు కొందరు పిడుగులు. కానీ నిజమర్రా... ఈ బాతు బొమ్మలోనే కుందేలు దాగి వుంది. కనిపెట్టండి చూద్దాం.

దారి చెప్పొచ్చుకదా

"అబ్బో... ఈ దారి చాలా గజిబిజిగా వుంది. సాలీడు లోపలినుంచి బయటికి రావాలంటే చాలా కష్టం బాబూ..." అనిపిస్తుంది చూసినవారికెవరికైనా! కానీ మీలాంటి చాకులకు కాదని మాకు తెలుసు. మరి మేం పది నెంబర్లు లెక్కబెట్టేలోగా మీరు దారి కనిపెట్టాలి. రెడీనా.





మొత్తం తోడేళ్లు ఎన్ని?

అదో అడవి. అందులో ఓ ఆవు తన రెండు దూడలను తీసుకుని మేతకెళ్లింది. ఈలోగా ఐదు తోడేళ్లు వాటి వెంట పడ్డాయి. ఇంకేముంది! పాపం ఆవు తన పిల్లలను కాపాడుకునే ప్రయత్నంలో తను తోడేళ్లకు దగ్గరగా వెళ్లింది. ఇంతకీ తోడేళ్లు ఐదేనంటారా! మాకేంటి ఆరు కనిపిస్తున్నాయి? మీరూ పరిశీలనగా చూడండి. ఆరో తోడేలు ఎక్కడుందో!

(జవాబు: కొండల ఆకారంలో ఓ తోడేలు దాగి వుంది. కనిపించిందా!)

అణు విద్యుత్

అవకాశాలు- అపాయాలు

అమెరికాతో అణు సహకార ఒప్పందంపై చెలరేగిన రాజకీయ దుమారం దేశంలో ఎన్నడూ లేనంత ఆసక్తిని రేకెత్తించింది.దీనివల్ల మనకు ఎన్నో ప్రయోజనాలు ఒనగూడుతాయని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రచారం చేసింది. అణు విద్యుత్తు లేకపోతే అభివృద్ధి లేదనే వాదనలు తారాస్థాయిలో వినిపించాయి.అణు విద్యుత్తుకు సంబంధించి సాంకేతికంగా తగు సమాచారం లేకపోవడం ఇందుకు ఒక కారణం.మరోవైపు సమస్య సాంకేతికంగానే గాక అంతర్జాతీయ రాజకీయాల నేపథ్యం గురించిన వాస్తవాలు చెప్పకపోవడం మరో కారణం. అణు విద్యుత్తు మంచి చెడ్డల కన్నా అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం వల్ల మన అణు స్వతంత్రానికి, రాజకీయ సార్వభౌమత్వానికి కలిగే హాని ఏమిటన్నదే ఇక్కడ ప్రధానమైన ప్రశ్న. పైగా ఏ షరతులూ లేకుండా అమెరికా మనకు అణు ఇంధన సరఫరా చేయబోదని కూడా ఇప్పుడు స్పష్టంగా రుజువై పోయింది. అమెరికాతో ఒప్పందం తుది రూపం తీసుకోకముందే ఫ్రాన్స్‌తో ఒప్పందంపై భారత దేశం సంతకాలు చేసింది. రష్యాతో సహా మరికొన్ని దేశాలపై ఇలాంటి ఒప్పందాలే కుదుర్చుకోనున్నట్టు వెల్లడించింది. అమెరికా ఆమోదం లేకపోతే ఈ ఒప్పందాలన్ని వాస్తవ రూపం దాల్చుతాయా అన్నది సందేహమే. అయినా అణు విద్యుత్తు అన్నది ఇప్పుడు ఒక ప్రధాన చర్చనీయాంశమై కూచుంది. అందువల్ల దాని పూర్వాపరాలు గురించి తెలుసుకోవలసిన అవసరమేర్పడుతున్నది.

అణు విద్యుత్తు గురించి తెలుసుకోవాలంటే ముందు అణువుతో మొదలెట్టాలి. పరమాణువు ఒక మహాఅద్భుతం. సర్వ పదార్థ సృష్టికి మూలం. దాదాపు 2500 సంవత్సరాల క్రితం డెమోక్రిటస్ అనే గ్రీకు తత్వవేత్త పరమాణువు (ఆటం) అనే పదార్థాన్ని కనుగొన్నాడు. 'విభజింప వీల్లేనిది' అనే అర్థంలో దానిని వాడాడు. అంతకంటే ముందునుండే, విభజించబడలేని అతిచిన్న కణాలతో విశ్వంలోని పదార్థమంతా నిర్మించబడిందన్న అభిప్రాయం వుండేది. కానీ 1898 లో క్యూరీ దంపతులు రేడియో మూలకాన్ని కనుగొనడంతో పరమాణువు అవిభాజ్యమనే అభిప్రాయం, సిద్ధాంతం వీడిపోయాయి. ఒక పరమాణువు విఘటనం చెందగలదనీ, అలా జరిగినపుడు పరమాణువుకంటే చిన్నగా ఉండే కణాలు ఏర్పడతాయినీ వారు నిరూపించారు. 1895లో రాంజన్ ప్రమాదవశాత్తు కనుగొన్న ని-రే లూ వంటి ఆవిష్కరణలు పరమాణువు, పదార్థ నిర్మాణాన్ని గురించిన సాంప్రదాయక భావనలు మారిపోవడం ప్రారంభించాయి. అతి చిన్న పదార్థం నుండి అత్యధిక శక్తి ఉత్పత్తి చేయవచ్చన్న ప్రత్యేక సాపేక్షతా సిద్ధాంతాన్ని 1905లో ఐన్‌స్టీన్ ప్రతిపాదించి శాస్త్రీయ ప్రపంచంలో పెనుతుఫానే లేపాడు. 1911 కల్లా లార్డ్ రూథర్‌ఫర్డ్, అతని సహాయకుడు నీల్స్ బోర్ ప్రయోగాలతో ఒక సరికొత్త పరమాణు నమూనా తయారైంది.

సూర్యుని చుట్టూ గ్రహాలు తిరుగుతున్నట్టే పరమాణువులోని కేంద్రకం (న్యూక్లియస్) చుట్టూ ఎలక్ట్రాన్లు తిరుగుతుంటాయి. పరమాణు బరువంతా కేంద్రకంలోనే ఉంటుంది. విద్యుదావేశం గల ప్రోటాన్లు, విద్యుదావేశంలేని న్యూట్రాన్లు ఇంకా ఇతర కణాలూ ఉంటాయి. ఎలక్ట్రాన్లు ఋణవిద్యుదావేశం కలిగి వుంటాయి(నెగెటివ్). సాధారణంగా ప్రోటాన్లు, ఎలక్ట్రాన్ల సంఖ్య సమానంగా ఉండటం వల్ల పరమాణువు తటస్థంగా (న్యూట్రల్) గా ఉంటుంది. ఏ కారణం చేతనైనా ప్రోటాన్, ఎలక్ట్రాన్లలో దేన్నయినా కోల్పోతే అది విద్యుదావేశం పొంది, అయాన్‌గా మారుతుంది. పరమాణువుల్లో ఐసోటోప్‌లు అనేవి ఉంటాయి. సాధారణ పరమాణువుల్లో కంటే ఐసోటోపుల్లో న్యూట్రాన్లు కొద్దిగా ఎక్కువగానో, తక్కువగానో ఉంటాయి. ఇలాంటి మార్పులున్నప్పుడు ఆ పరమాణువు అస్థిరంగా ఉంటుంది. ఈ అస్థిరత్వమే అణు భౌతిక శాస్త్రంలో కీలకమైంది. దాని ప్రకారం అస్థిర పరమాణువులు స్థిరత్వం పొందేవరకూ విభజింపబడుతూ పోతాయి. యురేనియం అనే మూల పదార్థ కేంద్రకంలో విచ్ఛిత్తితో ఇతర యురేనియం కేంద్రకాలన్నీ ఒకదాని తర్వాత ఒకటిగా త్వరితంగా విడిపోయే చర్యను చెయిన్ రియాక్షన్(గొలుసుకట్టు ప్రక్రియ) అంటారు. ఎన్రికో ఫెర్మి ప్రతిపాదించిన ఈ సిద్ధాంతం పరమాణు బాంబు నిర్మాణానికి దారితీసి మహా విధ్వంసానికి కారణమైంది. ఐన్‌స్టీన్ కూడా ఈ పరిణామానికి ఎంతగానో విచారించాడు. ఈ విధ్వంస విషాదాలే విద్యుదుత్పత్తికి కారణమైనాయి. అయితే పరమాణు కేంద్రకంలోని అపారశక్తిని శాంతియుత ప్రయోజనాలకు ఉపయోగపడేలా చేయలేమా అన్న ప్రశ్నకు సమాధానం చాలా కాలానికి గానీ లభించలేదు. సూటిగా చెప్పాలంటే పరమాణు కేంద్రక విచ్ఛిత్తి ఒక్కసారిగా జరిగితే విధ్వంసం, నెమ్మదిగా నియంత్రిత పద్ధతిలో జరిగితే శక్తి వుత్పత్తి. గొలుసుకట్టు చర్యను ప్రారంభించిన తరువాత అది చెయ్యిదాటిపోకుండా, విడుదలవుతున్న న్యూట్రాన్లను అదుపు చేయడం కోసం వైజ్ఞానిక ప్రపంచం చాలా కాలం పాటు పోరాడింది. చివరకు 1942లో ఎన్రికో ఫెర్మి ఈ పని చేసే మొదటి రియాక్టర్‌ను చికాగో విశ్వవిద్యాలయ మైదానంలో నిర్మించాడు. దానిలోనే న్యూట్రాన్ల వేగానికి కళ్లెం వేసేందుకు గ్రాఫైట్ కడ్డీలను అమర్చాడు.

కొద్దిగా చాలు

ప్రస్తుతం రియాక్టర్లన్నీ కాస్త అటూఇటుగా ఫెర్మి నమూనానే పోలివున్నాయి. అయితే కొన్ని మారణాయుధాలకు జోడించే పదార్థాలను ఉత్పత్తి చేస్తే, ఇంకొన్ని ఐసోటోపులను తయారు చేస్తాయి. ఇటువంటి ఐసోటోపులు వైద్యశాస్త్రం, వ్యవసాయం, పరిశ్రమలు, పరిశోధనల్లో విరివిగా వాడబడుతున్నాయి. వీటన్నిటికంటే ముఖ్యమైనది శక్తి ఉత్పత్తి. అణువిద్యుత్ - నిజానికి పరమాణు విద్యుత్ - ఎన్నో ఆశలతో జనించింది. కొద్దిపాటి యురేనియంని వాడితే ఒక పెద్దసైజు పట్టణానికి ఒక ఏడాదికి సరిపడా విద్యుత్‌ని ఉత్పత్తి చేయవచ్చని అర్థమైంది.

మన శాస్త్రజ్ఞుల ప్రతిభ

భారతీయ శాస్త్రజ్ఞులు స్వయంకృషితోనే అణు వ్యవస్థను పెంపొందించారు. ఇందుకు అవసరమైన రియాక్టర్లను అప్పట్లో సోవియట్ యూనియన్ సరఫరా చేసింది. వాటికి యురేనియం సరఫరా చేస్తానని హామీ ఇచ్చిన అమెరికా 1968 నుంచి ఎన్‌పిటిపై సంతకం చేయవలసిందిగా ఒత్తిడి చేస్తూ వచ్చింది.1974లో పోఖ్రాన్‌లో మొదటి అణ్వస్త్ర పరీక్ష తర్వాత ఏకపక్షంగా అణుఇంధన సరఫరాలు నిలిపేసి 1975లో ఎన్‌ఎస్‌జి పేరిట సరఫరా దేశాల కూటమిని ఏర్పాటు చేసింది. అయితే ఈ ఆంక్షలను అధిగమించి మన శాస్త్రజ్ఞులు ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ల పద్ధతిలో అణుశక్తి ఉత్పత్తి చేసే ప్రక్రియను అభివృద్ధి చేశారు.1997లో మన రాకెట్ పరీక్షలకు కూడా అమెరికా అడ్డుపడింది. 1998లో వాజ్‌పేయి హయాంలో పోఖ్రాన్ రెండు తర్వాత కూడా ఆంక్షలు విధించినా అప్పటికే మన శాస్త్రజ్ఞులు స్వీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్న కారణంగా అంతకు ముందులా తలకిందులు కాకుండా నిలబడగలిగాము. ఎన్‌పిటి మరో రూపంగా వచ్చిన సిటిబిటిపైనా సంతకం చేయడానికి నిరాకరించాము. అయితే ఇప్పటి ఒప్పందాలతో ఆ స్వతంత్రం హరించుకుపోయే ప్రమాదం ఏర్పడింది.

పరమాణువుల ద్వారా విద్యుత్ రూపొందిస్తారని చాలామందికి తెలుసుకానీ ఎలాగో చాలా తక్కువ మందికి తెలుసు. న్యూక్లియర్ రియాక్టర్లలో కేంద్రకాల విచ్ఛిత్తి వల్ల మొదట ఉష్ణశక్తి ఉత్పత్తి అవుతుంది. ఈ వేడితో నీటిని ఆవిరిగా మారుస్తారు. ఆవిరితో భారీ టర్బయిన్లను తిప్పి, జనరేటర్ల ద్వారా విద్యుత్ ఉత్పాదన జరుపుతారు. జలవిద్యుత్‌గానీ, థర్మల్ విద్యుత్ గానీ దాదాపు ఇదే పద్ధతి ద్వారా జనిస్తాయి. కాకపోతే టర్బయిన్లను తిప్పేందుకు వాడే శక్తి మాత్రమే వేర్వేరు పద్ధతులలో సృష్టించబతుంది.

పొంచి ఉండే ప్రమాదాలు

న్యూక్లియర్ పవర్ ప్లాంట్లు ముఖ్యంగా ఒకే సూత్రంపై నిర్మించబడతాయి. అయినా వాటిలో ప్రమాదం చాలా ఎక్కువ. యురేనియం విచ్ఛేదనం నుండి న్యూట్రాన్లు నియంత్రణ వరకు ప్రతి చర్యా చాలా జాగ్రత్తగా పర్యవేక్షించవలసి ఉంటుంది. పైగా అటువంటి ప్లాంట్ నిర్మాణం కూడా చాలా జాగ్రత్తగా జరగవలసి ఉంటుంది. అసలు ప్లాంట్ చుట్టూ దాదాపు 2 కిలో మీటర్ల పరిధిలో రక్షిత ప్రదేశం ఉండాలి. దానికి ఆవల 5 కిలోమీటర్ల పరిధిలో 10,000 మంది ప్రజలు మాత్రమే నివాసముండే వీలుంది. దాని అవతల 10 కిలో మీటర్ల పరిధిలో 20,000మందీ, 30 కిలోమీటర్ల పరిధిలో లక్షమందీ నివాసముండవచ్చు. అంటే అసలు ప్లాంట్‌కి దాదాపు 5-10 కిలోమీటర్ల వరకు ఎవరూ ఉండరాదనే అర్థం. ఆ ప్రాంతంలో పంటలూ, చెరువులూ ఉండకూడదు. వీలైనంత వరకూ ఒకవైపు సముద్రం ఉంటే మంచిది. ఇటువంటి ప్రాథమిక జాగ్రత్తలు ప్రతి రియాక్టర్ దగ్గరా తీసుకోవలసిందే.

ఈ విషయంలో వాటిల్లే ప్రమాదాలకు చెర్నోబిల్ ఉదంతం ఒక భయంకర ఉదాహరణ. పూర్వపు సోవియట్ యూనియన్‌లో అణు విద్యుత్తును విస్తృతంగానే వాడేవారు. అమిత జాగ్రత్తగానూ వుండే వారు.కాని గోర్బచెవ్ హయాం మొదలైన కొద్ది కాలంలోనే చెర్నోబిల్ ప్రమాదం ప్రపంచాన్ని దిగ్భ్రాంత పరచింది. అక్కడ విడుదలైన రేడియేషన్ ప్రభావం కాన్సర్ వంటి వాటికి దారి తీసింది.

అన్నీ భౌతిక చర్యలలాగే పరమాణు ప్లాంట్లు కూడా టన్నుల కొద్దీ రేడియో యాక్టివ్ వ్యర్థాలను ఏటా వదులుతాయి. అటువంటి వ్యర్థాలను ఒక చోట భద్రంగా నిలువ ఉంచి, అవి మరింత బలహీనపడేవరకూ కాపుకాయాలి. అప్పుడు కూడా వాటిని భూగర్భంలోనే దాచాలి. అలా దాచే స్థితికి రావాలంటే పరమాణు వ్యర్థాలు కనీసం 30-40 సంవత్సరాలు నిలువ వుండాలి. ప్రతి మూలకానికీ ఒక నిర్దిష్ట సమయం తర్వాత క్షీణించే స్వభావం ఉంటుంది. ఒక్కో మూలకం దానిలో సగం అవ్వడానికి పట్టే సమయాన్ని అర్థజీవితం (హాఫ్ లైఫ్ అంటారు. ఈ హాఫ్ లైఫ్ కొన్ని నిమిషాల నుండి కొన్ని మిలియన్ల సవంత్సరాల వరకూ ఉండవచ్చు.

మూలకాలన్నింటిలోకెల్లా బహుశా అత్యధిక హాఫ్‌లైఫ్ యురేనియంకే ఉన్నట్టుంది. యురేనియం 238 హాఫ్‌లైఫ్ 4.5 మిలియన్ సంవత్సరాలు. పరమాణు ప్లాంట్లలో యురేనియమే కాక సీషియం, స్ట్రాన్షియం, టెక్నీషియం, నెప్ట్యూనియం వంటివీ విడుదలౌతాయి. కానీ వీటి హాఫ్‌లైఫ్ చాలా తక్కువ. అంటే అంతకాలం వరకే ఇవి రేడియేషన్ని విడుదల చేస్తాయన్నమాట. ఇక అణ్వస్త్రాల తయారీలో అయితే మరింత శక్తివంతమైన (కాబట్టి మరింత ప్రమాదకరమైన) వ్యర్థాలు విడుదలైతాయి.

అంత వీజీ కాదు

భూమిలో నిలువ చేసే ప్రక్రియ కూడా అంత సులభమైనదేం కాదు. అసలింత వరకూ అటువంటి నిలువలు ఎక్కడా నిర్మాణమే జరగలేదు. ఇప్పటికి ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 52,000 టన్నుల వ్యర్థాలు న్యూక్లియర్ ప్లాంట్‌లలో నిలువ వున్నాయి. ఇలా నిలువ చేయడంలో ఎన్నో భద్రతా, పర్యావరణ సమస్యలు వున్నాయి. వ్యర్థాలని లోహపాత్రలలో ఉంచి, భూమిలోపల వెయ్యి అడుగుల కింద దాచాలి. పైగా లోహ పాత్రలు కొన్ని సంవత్సరాల తరువాత దెబ్బతిని, లోపలి రేడియో యాక్టివిటీని నిలువరించలేని పరిస్థితి రావచ్చు. ఇటువంటి నిక్షిప్త స్థలం న్యూమెక్సికోలోని యుకా పర్వతాల సమీపంలో అభివృద్ధి చెందుతోంది. మొదటి విడత నిక్షిప్తం 2010లో ప్రారంభం కావచ్చు. 1950లలో తయారైన పరమాణు వ్యర్థాలు అప్పటికి నిక్షిప్త పర్చడానికి వీలుగా, కాస్త స్థిరంగా ఉండవచ్చు.

విచిత్రమేమిటంటే, రేడియో యాక్టివ్ పదార్థాలు ప్రమాదకారులే అయినా పరమాణు విద్యుత్ మాత్రం అత్యంత పరిశుభ్రమైన శక్తి జనకం. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న వాయు కాలుష్య సమస్యలు ఏ మాత్రం కలిగించని శక్తి సాధనం. ప్రస్తుతం దాదాపు సగటున 16 శాతం ప్రపంచ విద్యుత్ పరమాణు విద్యుత్ రూపంలోనే వస్తుంది. కొన్ని ప్రత్యేక కారణాల వల్ల ఫ్రాన్స్ దీన్ని ఎక్కువగా వినియోగిస్తుంది. కానీ ఈ ప్రక్రియకు వ్యతిరేకత కూడా తీవ్రస్థాయిలో వుంది. అందుకనే అమెరికాలో గాని, ఐరోపాలో గాని చాలా కాలంగా అణు విద్యుత్తు రియాక్టర్ల పుత్పత్తి వినియోగం దాదాపు నిలిచిపోయాయి. భారత దేశంతో ఒప్పందం వల్ల తమ వాణిజ్యం పెరుగుతుందనే ఆశకూడా అమెరికాకు వుంది.

వివిధ రకాల విద్యుత్

బొగ్గుతో పోల్చుకుంటే అణువిద్యుత్‌కు ఒకటిన్నర రెట్లు ఎక్కువ వ్యయం అవుతుంది. సహజ వాయువుతో పోలిస్తే రెండు రెట్లు ఎక్కువ. జల విద్యుత్‌తో పోల్చినా ఇదే ఫలితం వుంటుంది. భారతదేశంలో బొగ్గు నిల్వలు పుష్కలంగా వున్నాయి. దీనిని దృష్టిలో వుంచుకునే దేశంలో థర్మల్ ఇంధన వనరులు ఎక్కువగా వుంటాయని ప్రణాళికా సంఘం పేర్కొన్నది. జల విద్యుత్ విషయానికి వస్తే దాదాపు 150 గిగావాట్ల ఉత్పత్తి అయ్యే సామర్థ్యం వున్నది. కాని 2006 నాటికి 33 గిగావాట్లు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. అది కాకుండా నేపాల్, భూటాన్‌ల నుంచి 55,000 మెగావాట్ల విద్యుత్‌ను దిగుమతి చేసుకుంటున్నాము. జల విద్యుత్ మన ఇంధన వనరులను పెంచడమే కాక, అణు విద్యుత్‌కయ్యే ఖర్చులో సగం ఖర్చుకే లభిస్తుంది.

మన సంగతో...

ఇప్పుడైతే మన మొత్తం విద్యుత్ వినియోగంలో అణు విద్యుత్ వాటా మూడు శాతం కూడా లేదు. ఈ ఒప్పందం వాస్తవ రూపం దాల్చినా అది ఏడు శాతం దాటదు. అయితే అందుకోసం ఒకో రియాక్టర్‌ను దాదాపు మూడు లక్షల కోట్ల రూపాయల ఖర్చుతో ఏర్పాటు చేసుకోవాలి. వాటిని కూడా దిగుమతి చేసుకోవాలి. వాటిలో వినియోగించే యురేనియం విదేశాల నుంచే రావాలి. దాన్ని అణ్వస్త్ర తయారీకి వినియోగించలేదని సరఫరా దారులను ఒప్పించాలి. ప్రతి ఏటా వారినుంచి కితాబు తీసుకోవాలి. అంతేగాక వినియోగించిన అణు ఇంధనాన్ని పున:శుద్ధి చేసుకోవడంపైనా వారి నియంత్రణకు లోబడి వుండాలి

ఇప్పటికి మన దేశంలో 17 పరమాణు విద్యుదుత్పాదక కేంద్రాలున్నాయి. వాటిలో 4,120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. మరో ఆరు కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయి. అవి కూడా పూర్తయితే మరో 3,160 మెగావాట్లవిద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఈ రోజు మన దేశం దాదాపు లక్షా నలభైవేల మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తోంది. దానికి ఎక్కువ భాగం బొగ్గునే వాడుతున్నాము. అదే థర్మల్ విద్యుత్. అలా గాక జల వనరుల నుంచి జల విద్యుత్తు కూడా పెద్ద ఎత్తున ఉత్పత్తి అవుతున్నది.

యురేనియం, ప్లుటోనియం, థోరియంలను అణు ఇంధనంగా వినియోగించి తయారు చేసేదే అణు విద్యుత్తు. ప్రపంచ నిల్వల్లో మన దేశంలో యురేనియం నిల్వలు ఒక్క శాతం మాత్రమే. అదే థోరియం నిల్వలు మన దేశంలో 24 శాతం వున్నాయి. మనమే థోరియం ఎగుమతి చేయగలిగిన స్థితిలో వున్నాం. అయితే యురేనియంను ఉపయోగించినట్లుగా థోరియంను నేరుగా రియాక్టర్లలో ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి చేయడం సాధ్యంకాదు. దాన్ని ఉపయోగించుకోవాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలి. దానికోసమే మన శాస్త్రవేత్తలు "మూడు దశల అణు కార్యక్రమం" రూపొందించారు. ఇప్పటికే అనేక పరిజ్ఞానాలకు రూపకల్పన చేశారు. ఇది మనదేశం మన పరిస్థితులకు అనుగుణంగా మన అవసరాల కోసం దేశీయంగా రూపొందించుకొన్న పరిజ్ఞానం. గత 36 సంవత్సరాలుగా అమెరికా మనపై అనేక ఆంక్షలు పెట్టినా స్వతంత్రంగా అభివృద్ధి చేసుకున్నాం. థోరియం ముడి వనరుగా విద్యుత్ కేంద్రాలకు అవసరమయ్యే విధంగా అభివృద్ధి చేయడానికి ఇదే వేగంతో ప్రయోగాలు, పరిశోధనలు సాగితే మరో ఇరవై సంవత్సరాలు పట్టవచ్చు.

మనకున్న ఇంధన వనరులు, మన అవసరాలు, మనం అణు సాంకేతిక స్వావలంబన సాధించాల్సిన అవసరం- వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని గత ఐదున్నర దశాబ్దాలుగా కృషి జరుగుతోంది. భారత అణు శాస్త్ర పితామహుడు డాక్టర్ హోమీబాబా ఆధ్వర్యంలో అనేకమంది శాస్త్రవేత్తలు అప్పటినుంచి కృషి చేస్తున్నారు. మన దేశ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన అణు కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిని స్థూలంగా మూడు దశల కార్యక్రమం అని పేరు పెట్టారు.

అవి 1) ప్రకృతి సహజంగా లభించే యురేనియంను ఇంధనంగా ఉపయోగించి పనిచేసే ఒత్తిడితో కూడిన భార జల రియాక్టర్ల ద్వారా అణు విద్యుత్ తయారు చేస్తారు. 2) మొదటి దశలో ఉపయోగించిన ఇంధనాన్ని ప్లుటోనియంగా మార్చి ప్లుటోనియం+ యురేనియం కలిపి ఇంధనంగా ఉపయోగించే ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్స్ ద్వారా విద్యుదుత్పత్తి చేయడం. 3) థోరియంను ఉపయోగించుకొని పనిచేసే ఆధునిక అణువిద్యుత్ ఉత్పత్తి కర్మాగారాలు. మొదటిదశలో రియాక్టర్లు మనదేశ పరిజ్ఞానంతో తయారు చేసుకున్నాము. ప్రస్తుతం దేశంలో 15 భార జల రియాక్టర్లు పనిచేస్తున్నాయి. మరో నాలుగు నిర్మాణంలో వున్నాయి. ఇంకా అనేక రియాక్టర్లు ప్రణాళికల్లో వున్నాయి. వీటిని త్వరగా పూర్తి చేసుకుంటే అమెరికా నుంచి మనం రియాక్టర్లు దిగుమతి చేసుకోనక్కర్లేదు.

రెండో దశ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లు ప్రస్తుతం అభివృద్ధి చేసుకుంటున్నాము. మద్రాస్‌లోని కల్పకంలో ఒక ఫాస్ట్ బ్రీడర్ టెస్ట్ రియాక్టర్ పని చేస్తున్నది. ఇందులో వచ్చిన సానుకూల ఫలితాలను అనుభవాలను బట్టి 500 మెగావాట్ల ప్రాథమిక ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ నిర్మాణానికి డిజైన్ చేశారు. మొదటి దశ భారజల రియాక్టర్లలో విద్యుత్తు ఉత్పత్తికి ఉపయోగించిన యురేనియంను తిరిగి శుద్ధి చేసి ఈ రెండో దశలో ఉపయోగిస్తారు. అంటే పాత ఇంధన వ్యర్థాన్ని కొత్త ఇంధనంగా మార్చి ఉపయోగిస్తారన్నమాట. ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లలో థోరియం మూలకం యురేనియం -233, థోరియంలను కలిపి ఇంధనంగా ఉపయోగిస్తారు. దీనికోసం కల్పకంలో 'కామిని' పేరుతో ప్రయోగాత్మకంగా రియాక్టర్ తయారుచేశారు. దీని అనుభవంతో ఆధునిక భారజల రియాక్టర్ల తయారీకి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అణు అపాయాలు

అయితే ఇప్పుడు మన్మోహన్ ప్రభుత్వం ఏకపక్షంగా కుదుర్చుకున్న అణు సహకార ఒప్పందంతో ఈ స్వతంత్ర అణు వ్యవస్థ వారి అదుపాజ్ఞల్లోకి పోవలసిందే. మన అణు రియాక్టర్లను పౌర, సైనిక అని విభజించుకోవచ్చునని చెబుతున్నప్పటికీ వాస్తవంలో అంతర్జాతీయ అణు శక్తి సంస్థ పూర్తిగా అమెరికా చెప్పుచేతల్లో నడుస్తుంటుంది. వారి ఆధిపత్య వ్యూహాలతో ఏకీభవించిన దేశాలను వేధించడానికి ఈ ఒప్పందాలను సాకులుగా వాడుకోవడం సర్వసాధారణం. భారత దేశాన్ని గత మూడు దశాబ్దాలకు పైగా అలాగే ఆంక్షలతో వేధించారు. వాటిని అధిగమించి నిలబడేందుకు మన శాస్త్రజ్ఞులు విశేషంగా శ్రమించి విజయం సాధించారు. కాని ఇప్పుడు 123, హైడ్ చట్టం వగైరాలతో ఆ అణు స్వతంత్రం హరించుకుపోతున్నది.

అణు విద్యుత్తుకు సంబంధించిన సాంకేతికమైన అంశాలే మాట్లాడే వారు అంతర్జాతీయ రాజకీయాలకు సంబంధించిన ప్రాథమిక సత్యాలను కూడా పట్టించుకోకపోవడం విచారకరం. శాస్త్ర విజ్ఞానాన్ని లాభార్జనకు ఆధిపత్యానికి సాధనంగా చేసుకునే అమెరికా కూటమి వైఖరిని ప్రపంచ ప్రజలు చాలా సార్లుచూశారు. ఇప్పుడు కూడా భారత దేశం ఎంతో ఖర్చుచేసి రియాక్టర్లు దిగుమతి చేసుకున్న తర్వాత వాటిని అణ్వస్త్ర తయారీకి వినియోగించారని ఆరోపిస్తే అంతా తలకిందులై పోతుంది. ఇరాక్‌పై అలాటి ఆరోపణలతోనే దురాక్రమణ చేశారు. ఇప్పుడు ఇరాన్‌నూ బెదిరిస్తున్నారు. ఉత్తర కొరియాను కూడా అలాగే వేధించారు. రేపు ఇండియాకు అలాటి ప్రమాదం తప్పకపోవచ్చు. పైగా ఇండియాతో ఒప్పందాన్ని నమూనాగా చూపించి పాకిస్తాన్‌కు కూడా దీన్ని వర్తింపచేయాలనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో అణు బాంబు గొప్ప విజయమని ప్రచారం చేసుకునేలోగా పాకిస్తాన్ కూడా చేసింది. ఇప్పుడు కూడా అదే స్థితి ఏర్పడవచ్చు. దానివల్ల ఉపఖండంలో ఉద్రిక్తతలు ఇంకా పెరుగుతాయి. అన్నిటినీ మించి అద్భుత శక్తిగా కనిపించే అణువిద్యుత్తు వెనక అపాయాలు అనేకం పొంచి వున్నాయన్నది సత్యం. ఈ విషయంలో ఏకపక్ష ప్రచారాలు దేశానికి మేలు చేసేవి కావు.

*



డాక్టర్ వీరపనేని విష్ణునరావు,
అలర్జీ, ఆస్తమా వైద్య నిపుణులు,
శ్వాస (అలర్జీ, ఆస్తమా సెంటర్)
హిమాయత్‌నగర్, హైదరాబాద్.
ఫోన్ : 98499 67218

అధికమౌతున్న వాతావరణ కాలుష్యం వల్ల ఆస్తమా-అలర్జీ ప్రపంచ వ్యాప్తంగా శరవేగంగా పెరుగుతున్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా చలి కాలంలో మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఇది ఇంకా తీవ్ర ఆయాసానికి గురిచేస్తోంది. ఈ కాలంలో వచ్చే వైరల్ ఇన్‌ఫెక్షన్ కూడా చెలరేగడం మరో కారణం. బాధితులకే కాకుండా ఆ కుటుంబసభ్యులకు కూడా కంటి మీద కునుకు లేకుండా చేసే వ్యాధి ఇది. అయితే ఈ వ్యాధి మొదలయ్యేది బాల్య దశలోనే. ఈ దశలో నిర్లక్ష్యం చేస్తే చిన్న మొక్క మహా వృక్షంగా మారే విధంగా వ్యాధి ముదిరి మందులు పనిచేయని పరిస్థితికి చేరుకునే ప్రమాదముంది. బాల్యదశలోనే దీని నివారణకు చర్యలు తీసుకుంటే వారి జీవితం ఆనందంగా ఉంటుంది. లేనట్లయితే అందరికీ మానసిక క్షోభ మిగులుతుంది.

ఆస్తమా-అలర్జీ

పది ప్రశ్నలతో నిర్ధారణ

అయితే అందరినీ వేధించే ప్రశ్నేమిటంటే వారు కానీ, వారి పిల్లలు కానీ బాధపడేది ఆస్తమా-అలర్జీతో అని తెలుసుకోవడం ఎలా? దీన్ని కనుక్కోవడానికి కింది 10 ప్రశ్నలు ఉపకరిస్తాయి.

1. గత రెండు సంవత్సరాల్లో మీబాబు/పాప చీటికీ మాటికీ ఈ క్రింద పేర్కొన్న ఆరోగ్య సమస్యలతో బాధపడ్డారా? (మీకు ఎన్ని సరైనవి అనిపిస్తే అన్నిటికి టిక్కు పెట్టండి)

ఎ. ఆస్తమా బి. దగ్గు సి. శ్వాస తీసుకోవడంలో కష్టం డి. ఛాతీ పట్టేసినట్టు ఉండడం ఇ. డస్ట్ అలర్జీ యఫ్. గొంతులో గుర గుర.

2. రెండేళ్లలో ఎప్పుడైనా పైన పేర్కొన్న ఆరోగ్య సమస్యలకు అత్యవసర చికిత్సలు (ఉదా: రాత్రిపూట ఆసుపత్రికి అత్యవసరంగా వెళ్ళడం) ఏదైనా హాస్పిటల్‌లో చికిత్స పొందారా? (సరైన దాన్ని ఒక్కదాన్ని మాత్రమే ఎంచుకోండి)

ఎ.లేదు బి. ఒకసారి చికిత్స పొందాం సి. రెండు సార్లు వెళ్ళాం డి. మూడుసార్లు వెళ్ళాం ఇ. నాలుగు లేదా అంతకంటే ఎక్కువ సార్లే వెళ్ళి ఉంటాం.

3. పైన పేర్కొన్న సమస్యల కారణంగా బహుశా ఎన్ని రోజులు స్కూలుకు వెళ్ళలేదు? (సరైన దాన్ని ఒక్కటే ఎంచుకోండి)

ఎ. అలాంటి పరిస్థితి రాలేదు. బి. ఏదాదిలో ఐదు సార్లు ఇలా జరిగింది. సి. ఏదాదిలో ఐదు నుండి 10 రోజులు స్కూల్ మిస్ అయింది.

4. మీ పాప/బాబు పరుగెత్తినపుడు కానీ, ఆటలాడినపుడు కాని పైన పేర్కొన్న ఆరోగ్య సమస్యలు ఎదురయ్యాయా? (అంటే దగ్గు, ఆయాసం, పిల్లికూతలు, వగర్పడం, ఛాతీ పట్టినట్టు బాధపడ్డం లాంటివి. సరైనది ఒకటి ఎంచుకోండి)

ఎ. ఎప్పుడూ లేదు. బి. ఎప్పుడైనా ఒకసారి సి. కొన్నిసార్లు డి. చాలా సార్లు ఇలా జరుగుతుంది. ఇ. ఇప్పుడు ఆడినా గెంతినా, పరిగెత్తినా ఇలా జరుగుతూనే ఉంది.

5. పైన పేర్కొన్న ఆరోగ్య సమస్యలకు (అంటే దగ్గు, ఆయాసం, పిల్లికూతలు, జలుబు మొదలైనవి) గత నెలలో ఎప్పుడైనా ఏదైనా మందు వాడారా? (టానిక్‌కాని, టాబ్లెట్‌కాని, ఇన్‌హేలర్ లాంటివి కాని. సరైన దాన్ని ఒకటి మాత్రమే ఎంచుకోండి)

ఎ. ఈ నెలలో ఇలాంటి మందులేవి వాడలేదు. బి. వారంలో రెండుసార్లు ఇలాంటివి వాడాం సి. రెండు మూడు సార్లు వాడుంటాం, కాని ప్రతిరోజుకాదు డి. ప్రతి రోజు ఏదోఒకటి వేస్తూనే ఉంటాం. ఇ. ఒక రోజులోనే ఒకటి కంటే ఎక్కువసార్లు ఈ మందులు వాడాల్సి వస్తుంది. చాలా రోజులుగా ఇలా జరుగుతుంది.

6. గత నెలలో మీ బాబు/పాప పైన పేర్కొన్న సమస్యలతో పగలు కాని, ఉదయం లేవగానే కాని బాధపడ్డ సందర్భాలు ఉన్నాయి? (సరైన దాన్ని ఒకటి మాత్రమే ఎంచుకోండి)

ఎ. ఎప్పుడూ అలా జరగలేదు. బి. వారంలో రెండుసార్లు జరిగుండొచ్చు. సి. రెండు లేదు మూడు సార్లు జరిగుండొచ్చు కాని ప్రతిరోజు మాత్రం కాదు. డి. ప్రతి రోజు బాధపడతారు ఇ. ఒక రోజులోనే చాలాసార్లు వీటితో బాధపడుతుంటారు. చాలా రోజుల నుండి ఇలాగే జరుగుతుంది.

7. సరిగా ఇలాంటి బాధలతోనే (అంటే జలుబు, దగ్గు, ఆయాసం, పిల్లికూతలు, ఛాతీ బిగపట్టినట్టు ఉండటం లాంటివి) గత నెలరోజులుగా మీ బాబు/పాపకు రాత్రిపూట బాధపడటం తద్వారా నిద్రాభంగం జరిగిందా? (సరైనవి అన్నీ ఎంచుకోండి)

ఎ. ఎప్పుడూ జరగలేదు. బి. వారంలో ఒకరాత్రి జరిగింది. సి. ఒకటి లేదా రెండుసార్లు జరిగింది కాని ప్రతిరోజు మాత్రం కాదు డి. ప్రతిరాత్రీ వీటితో ఇబ్బంది పడుతున్నాం.

8. ఈ బాధల వల్ల (అంటే జలుబు, దగ్గు, ఆయాసం, పిల్లికూతలు మొ.) మీ బాబు/పాప చదువుకు ఇబ్బంది కలిగిందా? (సరైనవి అన్నీ ఎంచుకోండి)

ఎ. కలగలేదు బి. కలిగింది సి. ఇవిలేకుంటే ఇంకా బాగా చదివి ఉండేవారు. డి. కొన్నాళ్ళపాటు చదువు ఆపాల్సి వచ్చింది. ఇ.చదువుకే కాదు ఆటలకూ ఇబ్బంది కలిగింది యఫ్. పెరుగుదల కూడా ఆగిపోయింది.

9. ఈ బాధల వల్ల తల్లిదండ్రులు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నారు? (సరైనవి అన్నీ ఎంచుకోండి)

ఎ. అలాంటి బాధలేమీ లేవు బి. చీటికీ మాటికీ హాస్పిటల్స్‌కు వెళ్ళడం సి. డాక్టర్లను తరచూ మారుస్తూ ఉన్నాం (ఎంతకీ తగ్గకపోవడం వల్ల) డి. కుటుంబంలో మానసిక ప్రశాంతత కోల్పోయాం. ఇ. ఆర్థిక భారం పెరిగింది (మందులకు-డాక్టర్ ఫీజుకు)

10. పైన పేర్కొన్న బాధలు మీ కుటుంబంలో ఇంకెవరికైనా ఉన్నాయా? (సరైనవి అన్నీ ఎంచుకోండి)

ఎ. మాకు తెలిసినంతవరకు ఎవరికీ లేవు బి. తండ్రికి లేదా తండ్రి తరుపు వారికి ఉంది. సి. తల్లికి లేదా తల్లి తరపు వారికి ఉంది డి. రక్త సంబంధం ఉన్న దగ్గరి బంధువులకు ఉన్నది.

పైన ఇచ్చిన ప్రశ్నల్లో మీకు అవును అని మూడు సార్లు సమాధానం వస్తే ఆస్తమా-అలర్జీ ఉన్నట్లు. కాదు అని మూడుసార్లు సమాధానం వస్తే ఆస్తమా-అలర్జీ లేనట్లు. అయితే మీకు ఇంకా అనుమానం వుంటే ఆస్తమా-అలర్జీ వైద్యుణ్ణి సంప్రదించాలి. ఇతర పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారణ చేయించుకోవాలి. సరైన వైద్యం, సరైన సమయంలో తీసుకుంటే జబ్బును నియంత్రించే అవకాశముంది. ఆలస్యమయ్యేకొద్దీ వ్యాధి ముదురుతుంది.

*

తెర

తెలుగు సమాజం వెలుగు నీడలు

హరి చాలా ప్రామాణికమైన సమీక్షకుడు. అందుకే ఆయన సమీక్షను ఐఎస్ఐ మార్కుగా పరిగణించడం కద్దు. సృజన నుంచి సుప్రభాతం వరకూ వివిధ పత్రికల్లో ఆయన విస్తారంగానే సమీక్షలు చేశారు గాని అన్నీ అందుబాటులో లేవు. వున్నంతలో ఈ భాగంలో 19 సమీక్షలు చూస్తాం. కొంపెల్ల జనార్ధనరావుపై ఏటుకూరి ప్రసాద్ పరిశోధనా గ్రంథంపై సమీక్ష మొదటిది. భావ విప్లవకారుడు కొడవటిగంటి పుస్తకంపై సమీక్ష చాలా విలువైంది. కొకు రచయిత కావడానికి బదులుగా సామాజిక పరిశోధకుడై వుంటే ఎలా వుండేదన్న ఆలోచనాత్మకమైన ప్రశ్నతో ఈ సమీక్ష ముగించడం కొసమెరుపు. రచయితలే గాక డి డి కొశాంబీలు, జార్జి థాంప్సన్‌లు మనకు అవసరమన్నారు. నిజంగానే ఇప్పటికీ తెలుగు సమాజాన్ని క్రమపద్ధతిలో అధ్యయనం చేసే మేధావుల అవసరం చాలా వుంది. విశ్వనాథ 'వేయిపడగలు' పై సమీక్ష వంటివి నిజానికి క్లాసిక్స్ అనాలి.సృజన సంపాదకీయాలు, కఠోర షష్ఠమాలు వంటి వాటిపై సమీక్షలలో కూడా ప్రతి వాక్యమూ వాక్యాల మధ్య విరామమూ కూడా ఆలోచనకు పదును పెట్టేవే.



ప్రతి మానవ సమూహానికి సమాజానికీ తనదైన చరిత్ర వుంటుంది. ఆ చరిత్ర క్రమంలో ఆటుపోట్లు, ముందంజలూ, వెనుకడుగులూ వుంటాయి. కనిపించే అంశాల వెనక కనిపించని ప్రభావాలుంటాయి. సామాజిక సాంస్కృతిక రాజకీయ తదితర విభిన్న రంగాలకు సంబంధించిన పరిణామాలలో ఒక అంతస్సూత్రం వుంటుంది. దాన్ని సవ్యంగా పట్టుకుంటే సామాజిక పరిణామాల సారం పట్టుపడుతుంది. ఆ విధమైన అన్వయం చేసుకోవడానికి అపారమైన అధ్యయనం వుండాలి. అనుభవం ఆ అవగాహనను మరింత చిక్కబరుస్తుంది. ఆ లక్షణాలన్నీ పుష్కలంగా వున్నవాడు హరి పురుషోత్తమరావు. అభ్యుదయ సాహిత్యంతోనూ కమ్యూనిస్టు వుద్యమంతోనూ పెనవేసుకుపోయిన హరికి రాజకీయ నిబద్ధతతో పాటు సాహిత్య సినీ రంగాలపై గొప్ప పట్టు వుంది. ప్రతిభా ప్రవేశం కూడా వున్నాయి.

కమ్యూనిస్టు వుద్యమానికి జీవగర్ర అయిన గుడివాడ ప్రాంతంలో పుట్టి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అభ్యుదయ విద్యార్థి ఉద్యమాలతో పెరిగిన హరి మొదటి నుంచి అధ్యయన పిపాసి. ఏ డిగ్రీ చదివినా ఆయన మనస్సు మాత్రం సాంస్కృతిక రంగంలో వుండిపోయింది. అందుకే అధ్యాపక వృత్తిలో కొంత కాలం గడిపినప్పటికీ సాహితీ ప్రపంచమే ఆయనకు అసలైన చిరునామా అయింది. అభ్యుదయ యుగంలోని ప్రముఖులకు సన్నిహితంగా మెలిగిన హరి తర్వాత విరసం సంస్థాపనలోనూ పాలుపంచుకున్నారు. సినిమా రంగంలో చాలా కాలం గడిపారు. 'ఉయ్యాల జంపాల' చిత్ర నిర్మాణ బాధ్యతలు చూడటమే కాక ఆచార్య ఆత్రేయతో చాలా కాలం వున్నారు. గురజాడ కన్యాశుల్కంపై సాధికార వ్యాఖ్యాతల్లో ఆయన ఒకరు. అలాగే సాహితీ సృజనను అంచనా కట్టడంలోనూ సమీక్షించి సారాంశం నిగ్గు తేల్చడంలోనూ ఆయన అగ్రగణ్యులు. అనువాద ప్రక్రియలోనూ సిద్ధహస్తులు. కెవిఆర్, రారా వంటి వారికి వచ్చిన విస్తృతమైన ప్రసిద్ధి రాకున్నా హరి వారికి తీసిపోని విమర్శకులు. ఒక విధంగా అంతకంటే విలక్షణమైన వారు కూడా. ఇన్ని విశేషాలు కలిగిన హరి 2000 సంవత్సరం తర్వాత దాదాపుగా ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో వుంటూ సాహిత్య ప్రస్థానంలో భాగస్వామి అయ్యారు. 1935లో పుట్టిన హరి రెండేళ్ల కిందట అస్వస్థతకు గురై మళ్లీ కోలుకోలేక 2008 జులై 23 వ తేదీన కన్నుమూశారు. వివిధ సందర్భాలలో ఆయన చేసిన రచనలను పర్‌స్పెక్టివ్స్ వారు 'విభిన్న' పేరుతో చాలా చక్కగా ముద్రించారు.

ఈ పుస్తకంలో ఎనిమిది భాగాలున్నాయి. హరితో తమ అనుబంధాన్ని, ఆయన పాత్రనూ ఆర్ద్రంగా పంచుకుంటూ ఆత్మీయులు రాసిన 'హర్యానుబంధం' అనే భాగం చివర వస్తుంది.

జ్ఞాపకాలు అన్న పేరిట వున్న మొదటి చిన్న భాగంలో హరి తన బాల్యం, చదువు, ప్రభావాలు వగైరాలను క్లుప్తంగా రాసిన అంశాలు ఇచ్చారు. ప్రారంభం నుంచి ఆయనపై కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం, సాహిత్యాసక్తి ఎలా తీర్చిదిద్దిందీ ఈ జ్ఞాపకాలే చెబుతాయి. ఆయన జీవితంలో శ్రీశ్రీ ఒక మహా ప్రభావమనీ తెలుస్తుంది.

రెండవ భాగం ముందు మాటలు. హరి చాలా పుస్తకాలకు ముందు మాటలు రాశాడు. అందులో కొన్ని ఆయన అనువదించినవి. మరికొన్ని సంకలనం చేసినవి. ఇంకా కొన్ని ముందుమాటలుగానే రాసినవి.ఏది రాసినా సరే, ఆయన దాని చారిత్రిక స్థానాన్ని స్పష్టంగా వివరించడం చూస్తాం. ఉదాహరణకు నవలా వృత్తాంతము అన్న మొదటి వ్యాసం దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్లు'కు రాసిన ముందు మాట. విశ్వ సాహిత్యంలో కానవచ్చే నవలా వికాసం తెలుగులో కుంటుపడటానికి కారణాలు ఆయన దీనిలో బహు చక్కగా విశ్లేషించారు. 1921లో ఉన్నవ లక్ష్మీనారాయణ రాసిన 'మాలపల్లి' నవలను ఎపిక్‌గా అభివర్ణించారు. తర్వాత దానికి దీటైన నవల రాలేదన్నారు. నవల వాస్తవికతా బద్ధమైనందువల్ల తెలుగు నవలా రచయితలు కాల్పనికతపై మోజు వదులుకోలేకపోవడం వల్ల నవలా వికాసం కుంటుపడిందని సూత్రీకరించారు. చలం నవలలు ప్రతీకాత్మకంగా సమాజాతీతంగా నడిచాయి. మొదట్లో చలం ప్రభావంలోనే కొట్టుకుపోయిన కొడవటిగంటి మార్క్సిస్టు పరిజ్ఞానం అలవర్చుకున్నాక సమాజాన్ని ప్రతిబింబించే రచనలు చేయగలిగాడు. గోపిచంద్ నవలల్లో సమాజ చిత్రణ వుంటుంది గాని అది తెలుగు సమాజం కాదు. బుచ్చిబాబు రచనలు బాగున్నా అవి ఆంధ్ర దేశంలో జరిగిన ఆంగ్ల కథలు. మహీధర రథచక్రాలు గొప్ప నవలైనా తర్వాత కాలంలో ఆయన రచనల్లో నిజాయితీ లోపించింది. ఇలా అతి క్లుప్తంలోనే ఆయన సాహిత్యస్వభావాన్ని తేటతెల్లం చేశారు. తెలంగాణాపై వచ్చిన కొన్ని పుస్తకాలలో లేని స్థానిక వాస్తవికత 'చిల్లర

దేవుళ్లు'లో వుందని నిరూపించారు. హరి రాసిన ప్రతి వ్యాససంలోనూ ఈ విధమైన చారిత్రికత మనకు కనిపిస్తుంది. ఇదే నవలపై మరో వ్యాసం కూడా వుంది. సాహిత్య సంఘాలు-ధోరణులు పేరిట ఈ రచయిత సంకలనం చేసిన పుస్తకానికి రాసిన ముందుమాట కూడా చాలా కీలకమైంది. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో సామాజిక సంఘర్షణ వ్యవహార గ్రాంథిక భాషల మధ్య చర్చగా వ్యక్తం కావడానికి గల వర్గపరమైన ప్రాధాన్యతను ఆయన అద్భుతంగా పట్టుకున్నారు. తర్వాత కాలంలో అభ్యుదయ రచయితల సంఘం రచయితల సామాజిక బాధ్యతను గుర్తు చేసిన తొలి ప్రయత్నంగా ఆయన చక్కగా గుర్తించారు (ఈ ముందు మాటలో విరసం పేరును ప్రస్తావించలేదని కొన్ని విమర్శలు వచ్చాయి గాని స్థూలంగా దాన్ని ప్రగతిశీల వారసత్వంలో భాగంగా ఆయన పరిగణించి వుండొచ్చు). అలాగే మతోన్మాదపు చారిత్రిక నేపథ్యాన్ని తెలిపే మరో పీఠిక కూడా ఇందులో వుంది.

రెండవ భాగం 'సమీక్షలు'. ముందే చెప్పినట్టు హరి చాలా ప్రామాణికమైన సమీక్షకుడు. అందుకే ఆయన సమీక్షను ఐఎస్ఐ మార్కుగా పరిగణించడం కద్దు. సృజన నుంచి సుప్రభాతం వరకూ వివిధ పత్రికల్లో ఆయన విస్తారంగానే సమీక్షలు చేశారు గాని అన్నీ అందుబాటులో లేవు. వున్నంతలో ఈ భాగంలో 19 సమీక్షలు చూస్తాం. కొంపెల్ల జనార్దనరావుపై ఏటుకూరి ప్రసాద్ పరిశోధనా గ్రంథంపై సమీక్ష మొదటిది. భావ విప్లవకారుడు కొడవటిగంటి పుస్తకంపై సమీక్ష చాలా విలువైంది. కొకు రచయిత కావడానికి బదులుగా సామాజిక పరిశోధకుడై వుంటే ఎలా వుండేదన్న ఆలోచనాత్మకమైన ప్రశ్నతో ఈ సమీక్ష ముగించడం కొసమెరుపు. రచయితలే గాక డి డి కొశాంబీలు, జార్జి థాంప్సన్‌లు మనకు అవసరమన్నారు. నిజంగానే ఇప్పటికీ తెలుగు సమాజాన్ని క్రమపద్ధతిలో అధ్యయనం చేసే మేధావుల అవసరం చాలా వుంది. విశ్వనాథ 'వేయిపడగలు' పై సమీక్ష వంటివి నిజానికి క్లాసిక్స్ అనాలి. సృజన సంపాదకీయాలు, కఠోర షడ్జమాలు వంటి వాటిపై సమీక్షలలో కూడా ప్రతి వాక్యమూ వాక్యాల మధ్య విరామమూ కూడా ఆలోచనకు పదును పెట్టేవే.

నాల్గవ భాగం 'వ్యాసాలు'. ఇందులోని పధ్నాలుగు రచనలలోనూ చారిత్రిక ప్రాధాన్యత వున్నవి ఎక్కువ. ఆంధ్రజ్యోతి పత్రికలో 'తారీఖులు-దస్తావేజులు' శీర్షికన ఆయన వారం వారం రాసినవి దాదాపు 25 పేజీలున్నాయి. జాతీయ గీతాల కోసం పుచ్చలపల్లి సుందరయ్య నిర్వహించిన పోటీపై కథనం దీనిలో మొదటిది కావడం విశేషం. ఈ పాతిక పేజీల సమాచారం వాస్తవంలో కొన్ని తరాల తెలుగు ప్రజల భావ పరిణామానికి సాంస్కృతిక చలనానికి వ్యాఖ్యానం. అలనాటి సినిమాలు ఆ మేధావులు వగైరా వంటి వ్యాసాలు ఈ వ్యాస పరంపర ముగియగానే 'ఇప్పుడు' పేరిట గమనంలో రాసిన వ్యాసం వస్తుంది. ప్రపంచీకరణ యుగాన్ని సాక్షాత్కరింపచేస్తుంది. అరసం నుంచి విరసం వరకూ అని 197-0లో ప్రజాసాహితిలోనూ, అరసం,విరసం,ప్రస్తుతం పేరిట 2002లో ప్రస్థానంలోనూ ఆయన రాసిన వ్యాసాలు గొప్ప చారిత్రిక కొనసాగింపు వంటివి. ఈ పేర్లు ఇలా కుదరడం యాదృచ్ఛికమే అయినా అందులో సారాంశం చారిత్రికమైనదే. హరి నిత్య పరిణామశీలత, వాస్తవిక ధోరణి అర్థమవుతాయి. ఇదే భాగంలో జానపద కళల పరిణామం, చిత్రకళ, వంటి వాటిపై అధ్యయనాత్మక విశ్లేషణలున్నాయి. ఈ భాగంలోని పుస్తకాల బండి అన్న పెద్ద వ్యాసం పుస్తకాలు సాహిత్యం పుట్టుకను పరిణామాన్ని చాలా బాగా వివరించింది. కన్యాశుల్కంపై రాసిన మౌలిక పరిశీలనలు కొన్ని ఇందులో వచ్చాయి. 1993లో ఇండియా టుడే సాహిత్య సంచికలో 'రానున్నది దళిత సాహిత్యం' అంటూ స్త్రీవాదం వగైరాలను కూడా పరామర్శిస్తూ రాసిన వ్యాసం ఆయన దూరదృష్టికి నిదర్శనం.

సినిమాల్లో 'నలుపు తెలుపు' అన్న భాగంలో 8 వ్యాసాలు మన సినిమా పరిశ్రమ, పాత్రలు ముఖ్యంగా నాయకా నాయికలు కాలానుగుణంగా ఎలా మారుతూ వచ్చారో చూస్తాం. సినిమాల పట్ల ఆయనకు చిన్న చూపులేదు సరికదా వాటిలో సమాజం ఎలా ప్రతిబింబిస్తుందో చక్కగా పసిగట్టగలరు.

అంచనా ఆనే ఆరవ భాగంలో చలం, ఆత్రేయ, భద్రిరాజు కృష్ణమూర్తి, వరవరరావు, రారా, కేతు, ఎబికె వంటి వారిపై ఆయన అంచనాలు, అభిప్రాయాలు వున్నాయి. వీటిలో ఎక్కువ భాగం ప్రశంసాపూర్వకమైనవే. 'నివాళి' అన్నభాగంలోనూ నాలుగు వ్యాసాలున్నాయి.వాటిలో 'పోరాబాబు పో పోయి చూడు ఈ లోకం పోకడ' అన్న ఆత్రేయ పాట శీర్షికతోనే ఆయనకు అర్పించిన నివాళి విభిన్నంగా వుంటుంది. 'కారులో షికారుకెళ్లే...' వంటి పాట రాసిన ఆత్రేయ ఆఖరుకు మనసు కవిగా స్థిరపడిపోవడానికి కారణం మధ్య తరగతి నిష్క్రియా ప్రియత్వానికి పట్టం కట్టే సినీ పరిశ్రమ ధోరణి అని తేల్చిచెప్పారు. ఆఖరుగా మావో కథకు హరి అనువాదం ఇచ్చారు. హరి వాక్య నిర్మాణం చిన్నగా బిగువుగా వుంటుంది. ప్రతి మాటలోనూ చాలా బరువుంటుంది. విరసంలో చేరడంలో ఆయన రాజకీయ భావాలు స్పష్టమే. అయితే అంతకు ముందరి అభ్యుదయ సాహిత్య రాజకీయ వారసత్వాన్ని ఆయన ఏ విధంగానూ అపహాస్యం చేయలేదు. అలాగే విరసం తదతనంతర మార్పులను గమనించడంలోనూ వెనకపడలేదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆయనలో యాంత్రికత తక్కువ. అందుకే ప్రపంచీకరణ, మతోన్మాదాలపై సమైక్య పోరాటం అవసరాన్ని ఆయన ఆఖరు దశలో చేసిన రచనలు నొక్కి చెబుతాయి.

ఆఖరున 'హర్యానుబంధం' అనే భాగంలో ఆయన కూతుళ్లు కళ, కవిత, కుమారుడు రామదాస్‌లతో సహా మిత్రులు సహచరులు రాసిన నివాళి వ్యాసాలున్నాయి. ఎబికె, వరవరరావు, చేరా, చలసాని ప్రసాద్, తెలకపల్లి రవి,ఎ.గాంధీ, హరగోపాల్, పర్‌స్పెక్టివ్స్, ఆర్‌కె ఇలా ప్రతి వారూ ఆయన నిర్మల వ్యక్తిత్వాన్ని తమదైన శైలిలో గుర్తు చేసుకున్నారు. నిడివి రీత్యానూ రాజకీయంగానూ ఇందులో వరవరరావు రాసింది కొంచెం భిన్నంగా అనిపిస్తుంది. అందులోనూ హరి ప్రజాశక్తి బుక్‌హౌస్ దగ్గర ఆగిపోయాడనీ, అక్కడ ఆయన మాట వినేవారు లేకపోయారనీ రాయడం ఆశ్చర్యంగానూ కనిపిస్తుంది. దానిపై వివాదం అవసరం లేదు గాని ఒక్క మాట చెప్పుకోవాలి. వయోధర్మాన్ని బట్టి బాగా నెమ్మదించినా హరి అక్షర ప్రస్థానం తర్వాత కూడా కొనసాగిందే గాని ఆగింది లేదు. వాస్తవంలో ఆయన అక్కడ స్థిరంగా వుంటూ అందరినీ కలుసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన వారే ఎక్కువ. ఆ బహు దూరపు బాటసారి ఆఖరి సుదీర్ఘ మజిలీ అది...

ఎనలేని గౌరవాభిమానాలతో హరి రచనలను పుస్తకంగా తెచ్చిన ఆర్‌కె ఎంతైనా అభినందనీయుడు. ప్రగతిశీల వాదులెవరైనా ఈ పుస్తకాన్ని తప్పక చదవాలి. అది వారి సామాజిక అవగాహనకు గొప్పగా దోహదం చేస్తుందని ఘంటాపథంగా చెప్పొచ్చు.

*





విజ్ఞాన వీచిక

డా॥ కాకర్లమూడి విజయ్

వైరస్ ఇంధనం



ఈ వైరస్ బ్యాటరీల వల్ల వచ్చే లాభాలు చాలా ఆశాజనకంగా ఉన్నాయి. దాదాపు తొమ్మిదినెలల క్రితం బెల్చర్ తాను సృష్టించిన వైరస్ బ్యాటరీని తన లేజర్ పాయింటర్‌లో వాడారు. అనేక రీచార్జీల తరువాత కూడా ఆ బ్యాటరీ ఇంకా పని చేస్తూనే ఉంది. ఇంత దీర్ఘకాల మన్నికతో పాటు అతి చిన్న పరిమాణం కూడా అచ్చివచ్చే అంశమే.



వైరస్ అనగానే వ్యాధులు గుర్తుకొస్తాయి. అటు పూర్తిగా నిర్జీవాలూ, ఇటు పూర్తిగా జీవాలూ కాని ఈ సూక్ష్మాతి సూక్ష్మ వైరస్‌లు రాబోయే కాలంలో మానవాళికి ఉపయోగపడే రీతిలో మారనున్నాయి. ప్రస్తుతం మనం చేతి గడియారాల్లో 'ఇంకా అటువంటి కొన్ని పరికరాల్లో చిన్న సైజు బ్యాటరీలను వాడుతున్నాం. బహుశా ఇకపై ఆ బ్యాటరీల స్థానే వైరస్‌తో నిర్మితమైన మైక్రోబ్యాటరీలు రావచ్చు.

ప్రొఫెసర్ ఆంజెలా బెల్చర్ బృందం ఇటువంటి పరిశోధనలే చేస్తున్నారు. సిలికాన్ ఫిల్ముపైన కోబాల్ట్‌తో పాటు కలిపిన నిరపాయకర ఎం13 వైరస్‌ను పోసి, దాని నుండి శక్తిని తీయవచ్చన్నది ఆమె ప్రతిపాదన. వైరస్ నెగెటివ్-ఛార్జ్‌తోనూ, కోబాల్ట్ పాజిటివ్ ఛార్జ్‌తోనూ ఉంటాయి. పైగా వైరస్, కోబాల్ట్ మిశ్రమాన్ని ఎక్కడికైనా సరే సులభంగా 'స్టాంపింగ్' చేయవచ్చు. దీనినే మైక్రో కాంట్రాక్ట్ ప్రింటింగ్ అంటారు. అయిదు మైక్రాన్ల (వెంట్రుక మందంలో సగం) మందం ఉండే ఈ వైరస్ బ్యాటరీలను వైద్యరంగంలో ఉపయోగించే ఇంప్లాంట్ల నుండి కొత్తతరపు 'చిప్స్‌పై ప్రయోగశాలలు' వరకూ వాడవచ్చు.

జన్యుపరంగా మార్పు చేసిన వైరస్‌ని కాథోడ్‌లాగా వాడుతూ చేసే ఈ ప్రక్రియ వల్ల వంపు తిరిగిన ఉపరితలంపై కూడా 'స్టాంపింగ్' చేయవచ్చు. ఈ టెక్నాలజీలో కీలకాంశం వైరస్‌ని జన్యుపరంగా మార్పు చేయడం. ఈ జెనెటిక్ ఇంజనీరింగ్ వల్ల వైరస్ కొత్త ప్రొటీన్లను ఉత్పత్తి చేస్తుంది. ఆ ప్రొటీన్లు కోబాల్డ్ ఆక్సైడ్ అణువులను గ్రహిస్తాయి. ఇటువంటి పనిని (జీవులు ఇనార్గానిక్ రసాయన చర్యలు చేయడం) కొన్ని ఇతర జీవులు కూడా చేస్తున్నాయి. ఉదాహరణకు నత్తలు కాల్షియం కార్బొనేట్‌ను ఈ విధంగానే గ్రహించి తమ డిప్పలను తయారు చేసుకుంటాయి. వాస్తవానికి ఈ తరహా జీవులే తన ప్రయోగానికి ప్రేరణనిచ్చాయంటారు ప్రొ॥ ఆంజెలా బెల్చర్.

ఈ వైరస్ బ్యాటరీల వల్ల వచ్చే లాభాలు చాలా ఆశాజనకంగా ఉన్నాయి. దాదాపు తొమ్మిదినెలల క్రితం బెల్చర్ తాను సృష్టించిన వైరస్ బ్యాటరీని తన లేజర్ పాయింటర్‌లో వాడారు. అనేక రీచార్జీల తరువాత కూడా ఆ బ్యాటరీ ఇంకా పని చేస్తూనే ఉంది. ఇంత దీర్ఘకాల మన్నికతో పాటు అతి చిన్న పరిమాణం కూడా అచ్చివచ్చే అంశమే.

మరోపక్క ఈ బ్యాటరీల తయారీ కూడా పర్యావరణంపై ఎటువంటి దుష్ప్రభావం చూపదు. సాధారణ ఉష్ణోగ్రతలో తయారీ, ఇబ్బందికర లోహాలైన కోబాల్ట్, లిథియం వంటి వాటిని అతి తక్కువగా వినియోగించడం, సుదీర్ఘకాలం పని చేయడం వంటివి రానున్న రోజులకు సరిగ్గా అనువైనవిగా కనిపిస్తున్నాయి.

ప్రస్తుతానికి ఇటువంటి సూక్ష్మ బ్యాటరీలను వైద్యరంగంలో క్యాన్సర్, హృద్రోగాలను పసిగట్టడానికీ, నియంత్రించడానికీ ప్రథమంగా వాడాలని నిర్ణయించుకున్నారు.

కానీ బెల్చర్ ప్రకారం ఇది మరిన్ని ఆసక్తికరమైన ఉపయోగాలను ఇవ్వవచ్చు. ఉదాహరణకు కార్లకు ఇప్పుడు వాడే భారీ బ్యాటరీల బదులు కారు ఉపరితలంపైన నిర్మితమయ్యే విధంగా ఈ బ్యాటరీలను రూపొందించవచ్చు. మనం ఉపరితలం, అయాన్లను ఇస్తే చాలు, బ్యాటరీలు వాటంతటవే రూపొందుతాయి.

బెల్చర్ కృషి అతి త్వరలో ప్రజావసరాలకు వినియోగపడుతుందని ఆశిద్దాం.

*

వీరి వీరి గుమ్మడి పండు

జవాబు

వీరి వీరి
గుమ్మడి
పండు
వీరి పేరు
బాపూజీ



మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్
ఫోన్ నెం:9390044031

లావవుతానని భయంగా వుంది

నేను మంచి కంపెనీలో జాబ్ చేస్తున్నాను. ఈ మధ్య ఎందుకో ఆకలి ఎక్కువగా ఉంటోంది. దానితో ఎక్కువగా తింటున్నాను. లావు అవుతాననే భయం పట్టుకుంది. సలహా ఇవ్వగలరు?

సంజన, కూకట్‌పల్లి.

మామూలుగా కంటే ఎక్కువ తింటున్నారంటే మీరు ఒత్తిడికి గురై ఉండి ఉండవచ్చు. ఒత్తిడికి గురయ్యే సమయంలో ఆకలికి కారణమైన గ్రెలిన్ హార్మోన్ ఎక్కువ మోతాదులో విడుదల కావడమే! తీవ్ర ఒత్తిడికి గురైనప్పుడు ఆ హార్మోన్ మోతాదు పెరుగుతుంది. దాంతో ఆకలి పెరుగుతుంది. ఒత్తిడి పెరుగుతుంది. దాని వల్ల బరువు పెరుగుతారు. మీలో ఒత్తిడి పెరగటానికి, మీ ఇల్లు, ఆఫీసు పనుల విషయాలను పరిశీలించుకోండి. కారణాలు తెలుసుకొని పరిష్కరించుకొంటే మీలో ఆకలి, బరువు తగ్గుతుంది. ఆలస్యం చెయ్యకుండా మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి. లేదా కౌన్సిలింగ్ సైకాలజిస్టును కలవండి.

టీవీ చూస్తే చాలు ఏడుస్తున్నాడు

నేను డాక్టర్‌ను. మా అబ్బాయి బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ వరకు మంచి ర్యాంకు స్టూడెంట్. బి.టెక్‌లో మొదటి సంవత్సరంలో టీవీ చూడటం అలవాటయ్యింది. టీవీ చూస్తే చాలు గట్టిగా. ఏడ్వడం, అరిచేయడం చేస్తున్నాడు. మొదటి, రెండవ సంవత్సరం సబ్జెక్టులు ఉండిపోయాయి. సలహా ఇవ్వగలరు?

బాషా, బెడుదూరు.

మీరు ఇంటర్ వరకూ అసలు టీవీ అంటే ఏమిటో తెలియకుండా చదివించారు. బి.టెక్ మొదటి సంవత్సరంలో టీవీ చూడడం మొదలు పెట్టేటప్పటికి ఎక్కువ ఆనందంగా అన్పించి వుండవచ్చు. తన మనస్సుకు ఆనందంగా ఉంది కాబట్టి టీవీ చూస్తూ ఇంతకాలం పొందలేని ఆనందాన్ని ఎంజాయ్ చేస్తున్నాడు. మీరు వద్దనేటప్పటికి మీరు తన ఆనందాన్ని పాడు చేస్తున్నారనే ఉద్దేశ్యంతో గొడవ చేయడం, అరవడం చేస్తున్నాడు. తనకు ఇష్టమైన సమయంలో గంట సేపు టీవీ చూడమని చెప్పండి. తనకు ఇష్టమైన వ్యక్తితో టీవీ చూడటం వల్ల భవిష్యత్తు ఎలా నాశనం అవుతుందో చెప్పించండి. మీరు ఏది చెప్పినా తన చెయ్యి పట్టుకొని చెప్పండి. స్నేహితులతో ఎక్కువ సమయం గడిపేలా ప్లాన్ చెయ్యండి. ఎక్కువగా మీరు ఇద్దరూ తనతో గడపండి. సైకాలజిస్టు వద్దకు తీసుకెళ్ళి కౌన్సిలింగ్ చేయిస్తే ఫలితముంటుంది. తను ఏమి కోల్పోతున్నాడు. తన శక్తి ఏమిటో తెలియజేస్తారు. బెస్ట్ ఆఫ్ లక్.

అమ్మాయిని మర్చిపోవాలంటే...

నేను డిగ్రీ వరకు చదువుకున్నాను. బిజినెస్ చేస్తున్నాను. ఒక అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయి నన్ను తిరస్కరించింది. నేనిప్పుడు ఆ అమ్మాయిని మర్చిపోవాలి. సలహా ఇవ్వగలరు?

శంకర్ ప్రసాద్, తిరువనంతపురం

బిజినెస్‌పై దృష్టి పెడుతూనే కొత్త బిజినెస్ అవకాశాలకై అన్వేషిస్తూ నిన్ను నువ్వు బిజీగా ఉంచుకో. నీకు మేలు చేసే కొత్త అలవాట్లతో ముందుగా రోజువారి దినచర్యను మార్పు చేసుకో. క్రమంగా కొత్త స్నేహాలపై దృష్టి పెట్టు. కాలంతో పాటు నెమ్మదిగా మనకు కుదుటపడుతుంది. ఒక్క విషయం గమనించు. నువ్వు ఏకపక్ష ప్రేమనే నిజమైన ప్రేమగా అనుకొంటున్నావు. నీతో ఆనందంగా ఉండదంలేదని అవతల వ్యక్తికి అనిపిస్తున్నంత కాలం, నువ్వు మాత్రం ఆ వ్యక్తితో ఆనందంగా ఎలా ఉండగలవో ఆలోచించు.

బాస్‌తో తిట్లు తప్పాలంటే...

నేను మంచి ఉద్యోగం చేస్తున్నాను. ఎక్కువగా నెగిటివ్‌గా ఆలోచిస్తాను. దానితో పని సరిగా చెయ్యలేకపోతున్నాను. బద్ధకిస్టుగా తయారయ్యాను. బాస్‌తో బాగా తిట్లు

తింటున్నాను. ఏమి చెయ్యాలో అర్థం కావడం లేదు. సలహా ఇవ్వగలరు.

జగదీశ్, రాజమండ్రి.

ఈ ప్రపంచంలో మనం కంట్రోల్ చేయలేనివి నాలుగు. మన పుట్టక, పేరు, ఎవరికి పుట్టాలి, ఏ ప్రదేశంలో పుట్టాలి వంటి అంశాలు మన చేతిలో లేనివి. మీరు చేయగలిగినదాన్ని మీ అదుపులో వుంచుకోగలరు. మీకు ఎదురయ్యే సంఘటన ఎలా రియాక్టు కావాలో తెలుసు. మీ ఆలోచనలు, వైఖరులను అభ్యసన సామర్థ్యాలను మీ నియంత్రణలో వుంచగలరు. ప్రజ్ఞాపాటవాలకన్నా, ఐక్యు కన్నా, ఆలోచనా విధానం ముఖ్యం. మిమ్మల్ని వెనక్కి లాగేవి, అదుపులో లేని విషయాలే. నెగిటివ్‌గా ఆలోచించడం, వైఖరి, ప్రవర్తన, ఇవన్నీ మీ సామర్థ్యానికి అవరోధాలుగా నిలుస్తాయి. కాబట్టి వాస్తవంగా ఆలోచించండి. మీలో వున్న ప్రతిభా సామర్థ్యాలను తెలుసుకోండి. 'నాకు నేనే పోటీ, నాకు ఎవరు పోటీ కాదు' అనుకోండి. కొత్త కొత్త విషయాలను నేర్చుకోండి.

❋

డా॥ జె.పి. వైద్య

అనుకోకుండా ఆ అమ్మాయికి యాక్సిడెంట్ అయింది. ఆసుపత్రిలో రెండు మూడు వారాలు ఉండాల్సి వచ్చింది. ఆ అబ్బాయి ఉరుకులు పరుగులతో విమానంలో వచ్చి వాలాడు. 'ఎలా ఉంది ఇప్పుడు?" అని ఆత్మీయంగా అడిగాడు. కళ్ళల్లో కళ్ళుపెట్టి చూసే ఇలాంటి బుద్ధిమంతుడు నా చెల్లెలికి భర్త అయితే ఎంత బావుంటుందీ? అని ఆలోచించిన ఆ ఎమోషనల్ పిచ్చి పెద్దక్కయ్య నోరారా- 'నువ్వు నా చెల్లెలిని పెళ్ళి చేసుకుంటావా?' అని అడిగేసింది. ఈడ్చి చెంప మీద ఫెళ్ళున ఎవరో కొట్టినట్లు ఫీలయిపోయి, విలవిల్లాడి పోయాడు ఆ అబ్బాయి. తమాయించుకుని. మెల్లగా ఒక్కొక్క మాట ఒత్తి మరీ చెప్పాడు.

ఐసా భీ హోతా హై!

ప్రపంచంలో ఎవరూ ఎవరికీ ఎల్లప్పుడూ మిత్రులు కారు. అలాగే ఎప్పటికీ శత్రువులు గానూ ఉండలేరు. నిజానికి అనేకమంది మనకి ఒకసారి మిత్రులుగా, ఇంకో సారి శత్రువులుగా మారిపోతుండడానికి కారణం.... వ్యవహారశైలి!

మనకు ప్రతికూలంగా వ్యవహరించకూడదనుకుంటే అందుకోసం మనం ఓ పని చెయ్యాల్సిందే! మన మనస్సును ఇతరులకు ప్రతికూలంగా ఫలితాలనిచ్చే పనుల నుంచి మళ్ళించాలి! అంతే!! హిందీ సినీ దునియాకు గుండె, మెదడూ, సర్వం 'ముంబాయి మహా నగరం'. నేటికి ప్రతి నిత్యం వందలవేల సంఖ్యలో సినీ తళుకు బెళుకుల గుడ్డి ఆకర్షణకు బలి అయి, అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి రైల్వే ప్లాట్‌ఫార్మ్ మీదో, బస్‌స్టాండ్ దర్గీలోనో అడుగు పెడ్తారు.

ఆ అడుగులు ముంబాయి నగరం, ఫూట్‌పాత్‌ల మీదా, విశాలమైన గజిబిజి రహదారుల మీదా, ఇరుకిరుకైన గల్లీల్లోనూ, కాళ్లరిగేలా తిరిగి తిరగి అలసిపోతాయి.

'దాదా ఫాల్కే అవార్డ్' వంటి మహోన్నత శిఖరాగ్ర పురస్కారం పొందిన మహా మహా మనుష్యులకే, తొలి రోజుల్లో ఆ పాట్లు తప్పలేదు. 'మొగల్ - ఏ- ఆజమ్' లోని 'ప్యార్ కియాతో దర్నా క్యా' లాంటి అద్వితీయ గీతం, 'బైజు బావరా'లోని 'తూ గంగా కి మోజ్, మై జమునా కే ధారా...', 'మన్ తరపత్ హరి దర్శన్ కో ఆజ్' లాంటి సదాబహార్ పాటలూ, 'కోహినూర్' లోని 'దో సితారోఁ కా జమీఁ పర్ హై మిలన్ ఆజ్ కి రాత్' - 'మధుబన్ మే రాధికా నాచేరేఁ' లాంటి క్లాసికల్ అందాల నందించిన హిందీ సినీ సంగీత శాస్త్రీయ సంస్కారాల భీష్మాచార్యుడి అంతటి ప్రతిభా పాటవాలున్న 'నౌషాద్ అలీ'కి ఫుట్ పాత్ జీవితం అనుభవాలు తప్పలేదు.

రెండు మూడొందల అత్తెసరు ఆర్జనతో ప్రారంభమైన ఆయన జీవితం 1944లోని 'రతన్' చిత్ర గీతాల ఆకర్షణతో అమాంతం 25000/- రూపాయల అత్యధిక పారితోషికం తీసుకునే సంగీతకారుడి రూపంలో ఎదిగింది.

'ఈ ఫుట్ పాత్ నుండి అవతల రోడ్డు మీది థియేటర్‌లో ఇంతటి సన్మానం పొందడానికి నాకు ఎన్ని సంవత్సరాలు కాళ్ళరిగించుకోవాల్సి వచ్చిందో, కడుపు మాడ్చుకోవాల్సి వచ్చిందో ఎందరికి తెలుసు' అని 'కళ్ళనీళ్ళు పెట్టుకొని మౌనంగా రోదించాడు ఆయన. హిందీ అయితేనే- తెలుగు సినీ విశ్వం అయితేనేం అలాంటి ఫుట్‌పాత్ జీవితం లోంచి, స్వశక్తితో ఎదిగి ఆకాశహార్మ్యాలను చేరుకొని, శాసించే స్థితికి ఎదిగిన వారు కొందరే! ఫుట్‌పాత్‌ల మీదే జీవితం కొనసాగించి, మురికి వాడల పూరి గుడిసెలో అరకొరగా బతికి తనువు చాలించిన వాళ్ళు వందలు వేల సంఖ్యలో ఉన్నారు. వారంతా అనామకులైన, అసంతృప్త కళాకారులు.

'భావనా సోమయ్య' అనే హిందీ, ఆంగ్ల భాషా జర్నలిస్ట్ కొంత మంది వెలుగుతున్న తారల 'ఇంటర్వ్యూ'లను పాతిక సంవత్సరాల క్రితం ప్రచురించారు. అలనాటి కొందరు జిలుగు వెలుగుల తారలింకా మన మధ్య ఉండటం మనం చేసుకున్న అదృష్టం.

ఒక అద్వితీయమైన ప్రతిభావంతురాలినీ, ప్రతిభతో పాటు అందం, వ్యక్తిత్వం, ప్రజ్ఞ, నటనా కౌశల్యం ఉన్న గొప్ప 'తార' తో మా పరిచయం మహా గమ్మత్తుగా జరిగింది.

రాత్రిపూట ముంబాయిలో 'ట్రాఫిక్ జామ్'లు ఎంతో మామూలు. అయితే అవి అప్పుడప్పుడు రాజ్‌కపూర్ రెండు ఇంటర్‌వెల్స్ లాంటి 'లంబా చౌడా' సినిమాల్లా సాగిపోతాయి. ఎర్రలైట్ శాపం పెట్టింది.

మా కారు చిన్న కుదుపుతో ఆగింది. పక్కనే మరో పొడుగాటి కారు కూడా నెమ్మదిగా వచ్చి ఆగిపోయింది. కాసేపటికి వెనక అద్దాలు మెల్లగా దిగాయి.

ఎంతో పరిచయం ఉన్న అందమైన మొహం పరిచయం ఉన్నట్టే చిన్న చిరునవ్వును వెదజల్లింది. మా కార్లో అందరి కళ్ళు జిగేల్ మంటూ వెలిగాయి. ఎర్రలైట్ మా కోసం చాలా సేపు వెలుగుతూ ఉండిపోయింది. ట్రాఫిక్ జామ్‌లో 'హల్లో'... 'హాయ్'ల పరిచయాలు కాస్తంత ఆత్మీయంగా పెరిగాయి.

"పన్నెండేళ్ళ చిరుప్రాయంలో ఆ అమ్మాయి అమాయకంగా కన్పించేది. పెద్ద పెద్ద కళ్ళు మటుకు క్లాసులో ఎవరిని 'బక్రా' చేయాలా అని గిరగిరా తిరుగుతూ పరిశీలనగా చూసేవి. రవంత బద్ధకం ఆమె సొంతం. వారాల తరబడి యూనిఫార్మ్ మార్చాలనిపించేది కాదు. ఆ అమ్మాయి స్టైల్స్ ఎంతగా మార్చేసిందంటే రెండు వారాల పాటు మళ్ళీ జడవేసే అవసరం ఉండేది కాదు.

బాపు కార్టూన్‌లోలా కనురెప్పలు, కనుబొమలు, పైకి లాగేసినట్టు ఉండేవి. మొహం మీద 'సదా ఆశ్చర్యార్థకం' విలయతాండవం చేసినట్టుగా ఉండి పోయేది.

క్లాసులో ఆ అమ్మాయి దాదాగిరి సాగిపోయేది. అల్లరి చేసే పిల్లల పేర్లు 'బ్లాక్ బోర్డ్' పైన రాయటం ఆమెకు ఎంతో ఇష్టమైన పని. దాని

వల్ల రెండు లాభాలుండేవి. ఒకటి ఇష్టం లేని వారి పేర్లు రోజూ రాయగలగటం - రెండవది రెండణాల 'లంచం' ఇస్తే మరుక్షణం పేరు చెరిపేయటం. అవతలి పక్షం వారి టిఫిన్ బాక్సుల మీద చాక్లెట్ల మీద దాడి లాంటి 'బోనస్' కార్యక్రమాలు సాగేవి. ఆమెదంతా వీర విహారం!

ఒక అబ్బాయి ఆ ఆకతాయి పనులన్నీ శాంతంగా గమనించేవాడు. ఆమెతో ప్రత్యేకంగా 'ఫ్రెండ్లీ'గా ఉండేవాడు. శాంతంగా సౌమ్యంగా మసలుకునేవాడు. పేదరికం వల్ల ఆ అమ్మాయి స్కూల్ పిక్‌నిక్‌లకు రాలేకపోతే సిగ్గుపడ్తూ అతడే కట్టేవాడు డబ్బులు. ఐస్‌క్రీం కొని పెట్టేవాడు. ఆ అమ్మాయి అంటే విపరీతమైన అభిమానం తోపాటు 'ప్రొటెక్టివ్'గా మసలుకునేవాడు. ఎప్పటిలా 'ట్యూషన్ ఫీ' కట్టలేకపోయింది. టీచర్ దులిపింది. 'నేను ఫీ తప్పకుండా కట్టేస్తాను' అని రెండువేల సార్లు 'హోమ్ వర్క్'గా రాసుకొని రమ్మని పురమాయించింది. ఆ అమ్మాయి గడుసరి. స్నేహితురాళ్ళతో రాయించింది. చేతిరాతలో పెనుమార్పులు టీచర్ గమనించి ఇంకా గట్టిగా దులిపింది. ఇల్లంతా, వొళ్ళంతా దులిపినా 'ఫీ' డబ్బుల్లేని ఆ అమ్మాయి మౌనంగా రోదించింది. సిగ్గుపడ్తూ మళ్ళీ ఆ అబ్బాయి 'ఆపద్బాంధవుడి' లా చెంత చేరాడు. 'ఏడవకు... నేను కడ్తాను నీ ఫీజ్' అని ఓదార్చాడు. ఆ అమ్మాయి బావురుమంది.

ఆ తర్వాత అకస్మాత్తుగా తండ్రి ట్రాన్స్‌ఫర్ వల్ల ఆ అబ్బాయి వూరు వదిలి వెళిపోయాడు. అమ్మాయి కళ్ళు మౌనంగా రోదించాయి. గుండెనిండా చెప్పలేని బాధ, వెలితి, ఏకాకి తనం వ్యాపించాయి.

పదిహేడు సంవత్సరాల తర్వాత అకస్మాత్తుగా, అనుకోకుండా కలిశాడు

'మీరు నా సినిమాలో నటించాలి. డేట్స్ ఇవ్వగలరా?" అని సౌమ్యంగా అభ్యర్థన పూర్వకంగా అడుగుతుంటే ఆ అమ్మాయి కళ్ళు విప్పారితంగా చూస్తూ ఉండి పోయాయి.

ఆ అబ్బాయి సువిఖ్యాత నటుడూ, ఎంపీ అయిన 'వినోద్ ఖన్నా' తమ్ముడు 'ప్రమోద్ ఖన్నా'!

స్కూల్లో దాదాగిరి చేసిన ఆ అమ్మాయి సినిమాల్లో రాణించింది. సిగ్గుల మొలకలా 'నాటకాల రిహర్సల్స్'కు వెళ్ళేది అక్కడో మహాసిగ్గరి తటస్థించాడు. స్నేహం మొగ్గ తొడిగింది. కాని, ఇద్దరికీ ధైర్యం ఉండేది కాదు.

ఓ కామన్ ఫ్రెండ్ వారి ఉత్తరాల బట్వాడా చేసే పోస్ట్‌మాన్ డ్యూటీ ఆనందంగా చేసేవాడు.

ఆ అమ్మాయి ఎంతో ట్యాలెంటెడ్. అ అబ్బాయి. మహానటుడు. ఎదురుగా అతడున్నప్పుడల్లా ఆఅమ్మాయి 'మ...మ్మ...త...త్త' అంటూ డైలాగులు మరచి పోయేది. కాలం వారిని విడదీసింది. ఇద్దరూ హిందీ సినీ సృష్టిలో మళ్ళీ కలిశారు. ఆయన మహానటుడు. అతడితో కలిసి నటించాలంటే అతిరథ మహారథులూ రెండుసార్లు ఆలోచించుకునేవారు.

ఒక రోజు ఆ మహానటుడూ, ఆ అమ్మాయి కలిసి షూటింగ్ నుంచి విడిదికి వస్తున్నారు. పక్క పక్కనే కూర్చున్నారు వ్యాన్‌లో. చాలా దూర ప్రయాణం. అనుకోకుండా జోరుగా గాలి వీచింది. ఆ అమ్మాయి చీర కొంగు గాలికి అంచెలంచెలుగా కెరటంలా లేచి అబ్బాయి గారి మొహం మీద వాలింది. అమ్మాయికి గుండె ఝల్లుమంది. అబ్బాయి తికమక పడ్డాడు. ఏ డైరెక్టరూ ఆ సన్నివేశాన్ని మరోలా మార్చలేకపోయారు.

"పెళ్ళి చేసుకుందామా?" అనే ధైర్యం 'ఎవరు ముందు?' అనే మీమాంస మధ్య కాలం గడిచిపోయింది. ఆ మహానటుడు కాల గర్భంలోనూ కలిసి పోయాడు అసందర్భంగా, అనుకోకుండా! మృత్యువు అతణ్ణి కబళించేస్తుందని ఎవ్వరూ ఊహించలేదు.

తర్వాతి రోజుల్లో ఆ అమ్మాయి సినిమాల్లో నిలకడగా నిలిచిపోయింది. డాన్సర్‌గా సెకండ్ రోల్స్ స్థాయి దాటి మెహమూద్ కళ్ళల్లో పడ్డది. మెహమూద్ ఆ రోజుల్లో సినిమాలనూ, సన్నివేశాలనూ శాసించే స్థితిలో ఉన్నాడు. ఆ అమ్మాయితో దోస్తీ కాకముందు అతడి సహనాయిక శుభా ఖోటే! ఆమె కాస్త పెళ్ళి చేసుకొని జీవితంలో కుదురుగా ఉండిపోవటం వల్ల మెహమూద్ తగిన సహనాయిక కోసం చూస్తున్నాడు. ఆ అమ్మాయిలోని ట్యాలెంట్‌ను అతడి చురుకైన కళ్ళు పసికట్టాయి. హెలెన్ చాలా బిజీ అయిపోయింది. అప్పటికి ముమ్‌తాజ్ స్థాయి కాస్త పెరిగి ఆవిడ దిలీప్ - దేవానంద్- రాజేష్ సరసన నాయికగా నటించే కాలం అది.

మొదటిసారి ఆ అమ్మాయి ఎంతో పేరు ప్రఖ్యాతులున్న 'మెహమూద్' ముందు సహనాయికగా నిల్చున్నది. మెహమూద్ 'తడాఖా'కు షమ్మీ రాజేంద్ర కుమార్ లాంటి ఉద్దండులే ఖంగుతిని, పలుచపడి పోయేవారు. అమ్మాయి అనవసరంగా భయపడి 'డైలాగ్' మరచిపోయింది. చాలాసార్లు 'రీటేక్స్' అయ్యాయి. మెహమూద్‌కు ఒళ్ళు మండింది.

-'ఏంటిదీ?' ఏం చేస్తున్నావ్? అయ్! ఓయ్!!' అని అరిచాడు.

షూటింగ్‌లో అందరి ముందు బావురు మంది ఆ అమ్మాయి. మెహమూద్ కోపం చటాలున ఎగిరిపోయింది. మెత్తపడ్డాడు. ఆ తర్వాత లాలించాడు. ఆత్మీయుడైపోయాడు. ఆదరించాడు. అక్కున చేర్చుకునేంత క్లోజ్‌నెస్ వారిద్దరిది.

వారి జోడీ 'శుభా-మెహమూద్'ల వ్యావసాయిక సఫలతను మించి పోయింది. మెహమూద్ భార్య విదేశీయురాలు. అంత దూరం నుంచి ఫోన్‌లో సగర్వంగా చెప్పేది. -'నా అసలు సిసలు స్నేహితురాలు ఆ అమ్మాయే! వెధవ అనుమానాలు పెట్టుకోకండి' అని స్టేట్‌మెంట్స్ కూడా ఇచ్చేసింది. ఎంత సినిమాలోకం రొమాంటిక్ వలయాలున్నా మెహమూద్ 'అల్లా'కు భయపడే మనిషి. 'సచ్చా మనిషి' - కాని, వారిద్దరూ పెళ్ళి చేసుకోలేదు. అతడు పట్టుపట్టి అడిగేస్తే ఆ అమ్మాయి 'ఊc' అని ఉండేదేమో! ఆయన అడగలేదు. ఆవిడ ఊc' అనలేదు. సినిమాలు సాగిపోయాయి. కాలం గడచిపోయింది.

ఆ అమ్మాయి జీవితంలో ఒక 'సింధీ యువకుడొచ్చాడు - హిందీ సినీ కళాకారులతో విదేశాల్లో 'సంగీత - నాట్య విభావరి' లాంటి కార్యక్రమాల నిర్వహణలో అందెవేసిన చేయి అతడిది. ఎప్పుడూ విదేశాల్లో ఉండేవాడు. భారతదేశం వచ్చినప్పుడల్లా ప్రత్యేకంగా ఆ అమ్మాయిని కలిసేవాడు. వారం వారం ఫోన్ చేసి యోగక్షేమాలు కనుక్కునేవాడు. అందరి గురించి అడిగేవాడు. మెల్లగా మనసులో మాట చెప్పలేక 'ఐ మిస్ యూ' అనేవాడు.

అనుకోకుండా ఆ అమ్మాయికి యాక్సిడెంట్ అయింది. ఆసుపత్రిలో రెండు మూడు వారాలు ఉండాల్సి వచ్చింది. ఆ అబ్బాయి ఉరుకులు పరుగులతో విమానంలో వచ్చి వాలాడు. 'ఎలా ఉంది ఇప్పుడు?" అని ఆత్మీయంగా అడిగాడు. కళ్ళల్లో కళ్ళుపెట్టి చూసే ఇలాంటి బుద్ధిమంతుడు నా చెల్లెలికి భర్త అయితే ఎంత బావుంటుందీ? అని ఆలోచించిన ఆ ఎమోషనల్ పిచ్చి పెద్దక్కయ్య నోరారా- 'నువ్వు నా చెల్లెలిని పెళ్ళి చేసుకుంటావా?' అని అడిగేసింది. ఈడ్చి చెంప మీద ఫెళ్ళున ఎవరో కొట్టినట్లు ఫీలయిపోయి, విలవిల్లాడి పోయాడు. ఆ అబ్బాయి. తమాయించుకున్నాడు. మెల్లగా ఒక్కొక్క మాట ఒత్తి మరీ చెప్పాడు.

-'నేను నిన్ను ప్రేమిస్తున్నాను... నీ చెల్లెల్ని కాదు' అని! ఆ అమ్మాయి ఏం మాట్లాడాలో తెలీక మళ్ళీ బావురుమంది. అమ్మాయి తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. కాని, ఆ అబ్బాయి తల్లిదండ్రులు 'రార్... నో...' అని బింకించి కూర్చున్నారు. అస్సలు ఒప్పుకోలేదు. ఆ అమ్మాయి అంటే విపరీతంగా పడి చచ్చినా, తల్లిదండ్రులను ఎలా ఎదిరించాలో అర్థం కాలేదు ఆ సింధీ అబ్బాయికి!

ఆ అమ్మాయి సినిమాలను శాసించే స్థితికి ఎదిగిపోయింది. కాని, ఎంత కోరుకున్నా 'టాప్ హీరోయిన్' కాలేక పోయింది. హిందీ సినీ మాయాలోకంలోని దాదాపు అందరు హీరోలతో, హీరోయిన్లతో కలిసి పని చేసినా ఆమెకు నేటికీ 'హీరోయిన్' అనే గుర్తింపు మటుకు రాలేదు.

రాజ్‌కపూర్ హిందీ సినీ దునియాలోని' గ్రేటెస్ట్ షో మ్యాన్'. ఆ గ్రేట్ ఆర్టిస్ట్ కోసం పట్టుబట్టి తన కొడుకు 'రిషి కపూర్' తొలి చిత్రం 'బాబీ'లో - 'నువ్వే డాన్స్ చేయాలి! తప్పదు! చింటూ తొలిసారి హీరోగా వేస్తున్నాడు... యూ హ్యావ్‌టు డాన్స్.. దట్సాల్' అన్నాడు. ఆమె హుషారుగా డాన్స్ చేసింది. ఆ పాటనూ, చిత్రాన్నీ యావత్ భారత్ దేశం యువతీ యువకులు నెత్తిమీద పెట్టుకొని మరీ ఊరేగారు. రాజ్‌కపూర్‌ను అది బంగారు కాసుల వర్షంతో తడిపేసింది. ఆ సినిమా 'బాబీ'! ఆ పాట 'మై షాయర్‌తో నహీc! అద్భుతమైన న్యాట్యంతో అందరినీ పాగల్ చేసి ఆ అమ్మాయి గడ్డం మీద గురివింద గింజ అంతటి పుట్టుమచ్చా నవ్వింది! ఆమె 'అరుణా ఇరానీ' 'హీరోయిన్' కాకపోతే ఏం? మనకు ఎవరిని ఆరాధించాలో తెలీదా ఏమి?

❊

ప్రాంతీయ పరిశోధనాచిత్రం



ప్రతి వ్యక్తికి వ్యవస్థకి ఒక చరిత్ర వుంటుంది. అది తమ వారికి అవసరం! అయిన వారికి అత్యవసరం!! పరాయివారికి అనవసరం!! ఏది ఏమైనా గత కాలపు విషయాల చరిత్రలు వర్తమానం వారు తప్పక తీసుకుతీరాలి. అందుకే వివిధ రంగాలకు చెందిన వారి గత కాలపు అంశాలకు స్వీయ చరిత్రలు- జీవిత చరిత్రలు. అవే పేర్లు పెట్టి సాహితీ క్షేత్రంలో స్థానం కల్పించారు. ఆ ప్రయత్నంలో భాగమే భద్రాచలం డివిజన్‌లోని చర్లకు చెందిన రంగస్థల రాజకీయ సేవా రంగకర్త సి.పి.కె. రావు అందించిన 'నేను - నా ప్రాంతం' స్వీయ చరిత్ర. క్రీస్తు పూర్వం నుండి భద్రాచలం ప్రాంత ప్రాముఖ్యత భక్త జయదేవుని కాలంలోని 'పేరూరు' మొదలు అనేక ప్రాంతాల విశిష్టతలు వివరిస్తూ సంబంధిత ఉదాహరణలు ఉటంకించారు. అలనాటి జైన కేంద్రమైన బాదలాపురమే నేటి భద్రాచలం' అనే విషయాలు కూడా ఇందులో వివరిస్తూ జైన సాంప్రదాయాల బద్ధంగా వ్యవహరించే "పాడు" అనే నామాంతర గ్రామాల విషయాలు కూడా ఇందులో పొందుపర్చారు. అలాగే రామాయణ కాలానికి చెందిన ఈ ప్రాంతపు పౌరాణిక ఆనవాళ్లనూ అశ్రద్ధ చేయలేదు.

ఎక్కువగా రాజకీయ, సాంఘిక కళారంగ విషయాలతో సాగిన ఈ పుస్తకంలో బ్రిటీషు కాలంనాటి పరిపాలనా విధానం జమీందార్లు-ఎస్టేటు పరిపాలనా విధానం జమిందార్లు ఎస్టేటు పరిపాలనా విధానంలా నాటి ఉద్యోగ విధానాలు చెప్పే ప్రయత్నం చేశారు. 1768 మొదలు ఆనాటి నైజాములు. కాకాతీయులు బ్రిటీషువారి పరిపాలనలతో పాటు స్వాతంత్రోద్యమం ఉప్పు సత్యాగ్రం, క్విట్ ఇండియా ఉద్యమాలు వాటిల్లో భాగస్వామ్యులైన చర్లకు చెందిన చింతల చెర్వు వెంకటాద్రి, భద్రాచలంకు చెందిన కుంచేటి శ్రీరామూర్తి కృషిని పేర్కొన్నారు. చర్లకు గల వేల సంవత్సరాల చరిత్రను తెలుసుకోవాల్సిన కర్తవ్యాన్ని పురావస్తు శాఖకు గుర్తు చేస్తూ కొన్ని ఆనవాళ్ళు పేర్కొన్నారు.

ఈ పుస్తకంలో పేర్కొన్న ప్రతివ్యక్తి, ప్రాంత విషయాల వివరణలో చారిత్రక వివరణా దృష్టే వుంది తప్ప స్వీయ కీర్తివాంఛ వాసనలు కనిపించవనే చెప్పాలి. భద్రాచలం మన్యం ప్రాంత పరిశోధనాత్మక సూచిక అయిన ఈ పుస్తకం అందరూ చదవదగ్గది.

రచన: సి.వి.కె. రావు

పేజీలు: 145/- వెల: అమూల్యం

ప్రచురణ గౌతమీనవ్య సాహితి

ప్రతులకు: సి.వి. కె. రావు బి.ఎ

శైలజావిహార్, రైసుపేట, చర్ల-507133, ఖమ్మం జిల్లా.

అమ్మిన శ్రీనివాసరాజు

కళ్ళ ముందరి సినిమా

ముళ్ళపూడి వెంకటరమణ-బాపుల గురించి పరిచయ వాక్యాలు రాయాలంటే సాక్షాత్ సూరీడు గురించి కొవ్వొత్తి పట్టుకొని వెదకబోయినట్టు నటించి, ఆ వెలుగుకు తట్టుకోలేక కళ్ళు మూసుకొని గుడ్డివాడై పోయినట్టు!

బుడుగు- సీగాన పెసునాంబ రోజుల్నుంచి సాహితీ, సినీ వినీలాకాశంలోని ఆ 'జంట ధృవతార'లు ప్రపంచం నలుమూలల్లోనూ అచ్చమైన తెలుగు వెలుగులను ప్రసరింపచేసిన వారే!

తెలుగు రసికుల రెండు కళ్ళు. తెలుగు పాఠకుల ఆరాధ్యదైవాలు.

కార్టూన్లకు తెలుగు గుండెలనే కాకుండా యావత్ దేశంలోని అభిమానుల 'వవ్వా'లను అందుకున్న వారే 'బాపూ-రమణ'లు!

దానికితోడు తెలుగు సినీ రసిక ప్రేక్షకుల గుండె 'లబ్-డబ్'ల చిరుయవ్వన నాయకుడు 'నాగేసర్రావ్' గారు తోడైతే!

తెలుగు సినిమాల వెండి తెర నవలా ప్రక్రియ గత 5-6 దశాబ్దాల్లుగా సాగుతున్న 'సాహితీ సల్లాపం'.

వెండి తెర నవల-కేవలం డైలాగుల జాతర, సీన్ల పరంపర, పాట జలధార. కెమెరా కళ్ళు బంధించే మూగబాసలు కాదు. అదో వినూత్న ప్రక్రియ. పాత్రల పరిచయం. సంభాషణల్లో అంతర్లీనంగా దాగి ఉన్న భావజాలం, కాస్తంత సినిమా చూస్తున్నట్టు మురిపిస్తూ సాగే కలం కదనం. పాఠకులకు, కాయితాల మధ్య సినిమా చూయించే ప్రయోగం. కాయితాల మధ్య పాఠకులను 'ప్రేక్షకులుగా' మార్చే తతంగం.

'ముళ్ళపూడి-బాపు'ల స్నేహం, గీతలు-గాధలూ, తెలుగు వాళ్ళ పాలిట అపూర్వ రంగవల్లులు.

బుడుగు, రాజకీయ బేతాళ పంచ వింశతిక, ఋణానందలహరి, ముత్యాల ముగ్గు, భాగవతం... ఇవన్నీ మనకు తెలిసినవే!

అన్నపూర్ణ వారి 'ఇద్దరు మిత్రులు' వెండి తెర మీద తెలుగువారిని ఆనంద కందోళిత హృదయాలను చేసిన ఎవర్ గ్రీన్ శ్వేతశ్యామ చిత్రం. 'హాసం' ఒకప్పుడు వినూత్నంగా వెలిగినన 'హాస్య-సంగీతం' పత్రిక. హాసం ప్రచురణలు 'ఇద్దరు మిత్రులు' రూపంగా 101 పేజీల్లో కళ్ళ ముందరి సినిమా రూపంగా రావడం ముదావహం. ముమ్ముందు ఇలాగే ఎన్నో 'నవలా రూపాలు' రావాలని కూడా ఆశిద్దాం.

అన్నపూర్ణావారి 'ఇద్దరు మిత్రులు' వెండితెర నవల

రచన: ముళ్ళపూడి వెంకటరమణ

పుజీలు: 101/- వెల: 40/-

ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్-హైదరాబాద్

డా॥ జె.పి. వైద్య



సమాచారం బాట సంచలనాల వేట

రచయిత: నాగసూరి వేణుగోపాల్

పేజీలు: 240

వెల: రూ 125/-

ప్రతులు దొరుకుచోటు:

ఎన్.కె. పబ్లికేషన్స్

24-8-1, సమీరా రెసిడెన్సీ

విజయనగరం - 535 001

సెల్: 94403 43479



ఇసుక హోటల్

అదో సముద్రపు ఒడ్డు. చెప్పలేనంత ఇసుక... నీళ్లు.. ఖాళీ స్థలం. ఇంక సృజనే హద్దు. ఆరుగురు సభ్యులున్న ఒక బృందం వాటన్నిటినీ ఉపయోగించుకొని... 600 గంటలు (రోజుకి 12 నుంచి 14 గంటలపాటు) కష్టపడి ఒక ఇసుక హోటల్ నిర్మించింది. అన్నట్టు దీనికోసం వెయ్యిటన్నుల ఇసుకను ఉపయోగించారు. దీని స్పెషాలిటీ ఏంటంటే... చుక్కలు నిండిన ఆకాశమే పైకప్పు. హోటల్‌లోని మంచాలు, దిళ్లు, టేబుళ్లు, సోఫాలు... అన్నీ ఇసుకవే. అయితేనేం హోటల్ అద్దె మాత్రం తక్కువకాదు. ఒక్కరాత్రి ఈ ఇసుక హోటల్లో నిద్రచేయడానికి 21 డాలర్లు సమర్పించుకోవాలి. ప్రపంచంలోనే మొట్టమొదటిదైన ఈ ఇసుక హోటల్‌ను ఎక్కడ నిర్మించారంటే...బ్రిటన్‌లో... వేమౌత్ బీచ్‌లో...!





కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూ్కడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్

కలంస్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్.

పేరు: మత్తుర్తి గంగా భవాని
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: బి.పి.ఎమ్ హైస్కూల్
లక్ష్యం: పేదలకు సహాయం చేయటం
హాబీలు: చదవడం, టీవీ చూడటం,అల్లికలు
చిరునామా: ఎమ్.గంగా భవాని, డాటరాఫ్: ధర్మారావు, బోండాడ వీధి, విజయనగరం.

పేరు: దాసరి సునీల్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: కథలు చదవడం, క్రికెట్ ఆడటం
చిరునామా: డి. సునీల్, సన్నాఫ్: వెంకటప్పయ్య, ఇంటి.నెం.8-37, బాయ్యారం, ఖమ్మం.

పేరు: ఈ.రవి
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: మోడల్ బేసిక్ హైస్కూల్
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, క్రికెట్ ఆడటం,
చిరునామా: ఈ.రవి, సన్నాఫ్: సవరన్న, చిన్న ఆముదాలపాడు, ఉండవల్లి(మం),మహబూబ్‌నగర్.

పేరు: బి. శ్రీకృష్ణ
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: నేషనల్ హైస్కూల్,
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: చదవడం, క్రికెట్ ఆడటం, పాటలు పాడటం.
చిరునామా: బి.శ్రీకృష్ణ, సన్నాఫ్: నరసింహ, బెక్కం(గ్రా), కొల్లాపూర్, మహబూబ్ నగర్.

పేరు: కె. రాందేవ్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: ఎన్.హెచ్ స్కూల్
లక్ష్యం: జర్నలిస్ట్ కావడం
హాబీలు: క్రికెట్ ఆడటం, పెయింటింగ్ వేయడం
చిరునామా: కె. రాందేవ్, సన్నాఫ్: వెంకటయ్య, బెక్కం(గ్రా), కొల్లాపూర్, మహబూబ్ నగర్.

పేరు: జి. సూర్య నారాయణ
చదువు: 10వ తరగతి
వయస్సు: 14 సం॥
స్కూలు: నేషనల్ హై స్కూల్
లక్ష్యం: ఉన్నత వ్యక్తి కావడం
హాబీలు: చదవడం, పాటలు పాడటం
చిరునామా: జి. సూర్య నారాయణ. సన్నాఫ్: చంద్రయ్య, అల్లాపూర్(గ్రా), నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్.